ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

ఏలూరు జిల్లా వార్తలు

5

మంగళవారం 25 ఫిబ్రవరి 2025



ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐజీ అశోక్ కుమార్

బలివే ఉత్సవాల్లో

పటిష్ఠ భద్రత

ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్

ముసునూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ పోలీస్ అధికారులకు సూచించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్‌తో కలిసి సోమవారం ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలించారు. స్వామివారి దర్శనానికి ఆలయం లోపల, వెలుపల ఏర్పాటుచేసిన క్యూలైన్లు, తమ్మిలేరులో నీటి మట్టం, స్నాన ఘాట్లు, పార్కింగ్ పాయింట్లు తదితర అంశాలను ఐజీ పరిశీలించారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. తమ్మిలేరులో నీరు ఎక్కువగా ఉన్నందున రెండు వైపుల గజ ఈతగాళ్లను స్నానఘాట్ల వద్ద ఉంచాలని సూచించారు. ఉత్సవాల్లో డ్రోన్ వినియోగించి, అనుమానితులను అదుపులోకి తీసుకోవాలన్నారు. స్వామివారి దర్శనానికి వీఐపీలు వచ్చినప్పుడు సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నిశాఖలను సమన్వయం చేసుకుంటూ, పటిష్ఠ పోలీస్ బందోబస్తుతో ఉత్సవాలను విజయవంతం చేయాలని ఐజీ అశోక్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో నూజివీడు డీఎస్పీ ప్రసాద్, సీఐ రామకృష్ణ, ఎస్ఐ ఎం.చిరంజీవి, పెదవేగి పోలీస్ అధికారులు, ఆలయ ఈవో పి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ సమావేశంలో జిల్లా ప్రజాప్రతినిధులు

కొల్లేరుకు శాశ్వత పరిష్కారం!

జిల్లా ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ

చాన్నాళ్లుగా కొల్లేరును పర్యావరణ సమస్య వెన్నాడుతూనే ఉంది. భూముల ఆక్రమణతోపాటు స్థానికుల జీవనాధారంపై చర్చ సాగుతూనే ఉంది. మరోవైపు సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై పడింది. ఈ నేపథ్యంలోనే కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనడం, సమాంతరంగా సుప్రీం ఆదేశాలను అమలు, పర్యావరణం కాపాడడం వంటి అన్ని విషయాలతోపాటు వేలాది మంది జీవనంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జిల్లాకు చెందిన ప్రతినిధులు, ఉన్నతాధికారులు సోమవారం విజయవాడలో భేటీ అయ్యారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

కొల్లేరు సమస్య మరింత ముదరడంతో ఉన్నత న్యాయస్థానం సుప్రీం మరోసారి కీలక ఆదేశాలు జారీ చేసింది. గడువులోపే కొల్లేరు కాంటూరు పరిధి, విస్తీర్ణం నిర్ణయించడం, దీనికి సర్వే విభాగాలను రంగంలోకి దింపడం, తీసుకున్న చర్యలు, సర్వే నివేదికలను వచ్చే నెల మూడో వారంలోపు సమర్పించాలని కూడా సుప్రీం ఆదేశించింది. సుప్రీం నిర్ణయం తమ జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందోనన్న ఆందోళన కొల్లేరు ప్రజల్లో నెలకొంది. ఈ నేపథ్యంలోనే మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో భేటీ అయ్యారు. కొల్లేరులో నెలకొన్న తాజా స్థితిగతులను సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఏకరువు పెడుతూనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

శాశ్వత పరిష్కారానికి కృషి..

కొల్లేరు ప్రాంతంలో దీర్ఘకాలికంగా నివసిస్తున్న ప్రజల సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎంపీ మహేశ్‌తోపాటు మిగిలిన ప్రజాప్రతినిధులు ఈ అంశంపై సమగ్రంగా చర్చించడమే కాకుండా వివిధ అంశాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.

- కొల్లేరు కీలక అంశాలపై చర్చ
- జిరాయితీ, సొసైటీ భూముల హద్దుల నిర్ణయంపై వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- సుప్రీంకోర్టు సూచనలకు లోబడి కొల్లేరు వాసులకు న్యాయం చేసేందుకు చర్యలు
- డిప్యూటీ సీఎం పవన్‌తోపాటు ఉన్నతాధికారులు హాజరు

జిరాయితీ భూములు 15 వేల ఎకరాలు, సొసైటీ భూములు 7 వేల ఎకరాలు విడగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించినప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం సర్వే చేసి హద్దులు నిర్ణయించడంలో నిర్లక్ష్యం చేసింది. దీనితో కొల్లేరు ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని ఎంపీ పుట్టా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కొల్లేరు ప్రజల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.

కేంద్రం దృష్టికి తీసుకెళ్తా : డిప్యూటీ సీఎం

కొల్లేరు సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భరోసా ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, బడేటి రాధాకృష్ణ, పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు సూచనలకు లోబడే..

సుప్రీంకోర్టుకు సూచనలకు లోబడి కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని ఎంపీతోపాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిదులు విజ్ఞప్తి చేశారు. కొల్లేరు ప్రాంతంలో పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా, స్థానికులకు ఇబ్బంది తలెత్తకుండా న్యాయం చేయడానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని జిల్లా ప్రజా ప్రతినిధులకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ భరోసా ఇచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కొల్లేరు ప్రాంతంలో చేపట్టిన చెరువుల ధ్వంసం ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసే దిశగా న్యాయపరంగా ఉన్న అంశాలను పరిశీలిస్తున్నట్టు సీఎం చంద్రబాబు వెల్లడించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారుల నివేదిక ఆధారంగా కొల్లేరు ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని సీఎం భరోసా ఇచ్చినట్టు తెలిపారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందనే విషయాన్ని వారికి తెలియజేయాలని జిల్లాకు చెందిన ప్రతినిధులకు సీఎం సూచించారు.



కనకవల్లి సమేత లక్ష్మీనారసింహుని ఉత్సవమూర్తులు

లక్ష్మీ నారసింహుడికి అభిషేకాలు

ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై సుదర్శన నృసింహ మహాయజ్ఞం

ఆలయంలో విశేష పూజలు 7



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

పోలింగ్‌కు సన్నద్ధం కావాలి

పారదర్శకంగా ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు 7

28 టేబుల్స్.. 17 రౌండ్లు

రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి

పరీక్షల్లో ఉత్తీర్ణతకు విద్యార్థులు

డబ్బులిచ్చి మోసపోవద్దు

'ఓపెన్' ఇంటర్ పరీక్షాకేంద్రాల సీఎస్‌లు, డీవోలతో జిల్లా విద్యాశాఖాధికారి సమావేశం



స్ట్రాంగ్‌రూమ్ వద్ద పోలీస్ భద్రత

ఇంటర్మీడియట్

ప్రశ్నపత్రాలొచ్చేశాయ్

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. ఏలూరులోని స్ట్రాంగ్‌రూమ్‌లో వాటిని భద్రపరిచి సాయుధ పోలీసులను ఉంచారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన 55 పరీక్ష కేంద్రాలకు ఆయా పరీక్షల రోజున తరలించేందుకు వీలుగా సమీపంలోని పోలీస్ స్టేషన్లు, సబ్ ట్రెజరీ కార్యాలయాలకు సోమవారం తొలి విడత ప్రశ్నపత్రాల బండిళ్లను వాహనాల్లో పంపించారు. మలి విడత ప్రశ్నపత్రాల పంపిణీ మంగళవారం జరుగుతుంది.



జ్ఞానజ్యోతి

చిన్నారులకు బోధనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆట పాటలు, బొమ్మలతో వారిలో విజ్ఞాన జ్యోతులు వెలిగించేందుకు కార్యాచరణ చేపట్టింది. జ్ఞానజ్యోతి పేరిట అంగన్‌వాడీ కార్యకర్తలకు చిన్నారులకు బోధనపై శిక్షణ ఇస్తున్నారు. విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్షా విభాగంతో సమీప ఉన్నత పాఠశాలల్లో వారికి తగిన శిక్షణ ఇస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలో నర్సరీ విద్యకు ధీటుగా అంగన్‌వాడీల్లో చిన్నారులకు విద్యపై ఆసక్తి కలిగేలా తీర్చిదిద్దనున్నారు.

చిన్నారులకు ఆట పాటలతో బోధన

- అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ
- జిల్లాలో 10 సీడీపీవో ప్రాజెక్టుల్లో శిబిరాలు
- దశల వారీగా మూడేళ్లు కొనసాగింపు
- విద్యాబుద్ధులు నేర్పేందుకు నైపుణ్యాలకు పదును

ఏలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లే విద్యాబుద్ధులు నేర్పేలా జ్ఞానజ్యోతి పేరిట శిక్షణ ఇస్తున్నారు. రానున్న రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాలరె బడి పిల్లలకు వెలుగుల నింపే జ్ఞాన శిక్షణాలయాలుగా మార్చేందుకు ముందడుగు పడింది. విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్షా విభాగం జిల్లాలో 10 సీడీపీవో ప్రాజెక్టులు శిక్షణ చేపట్టాయి. అంగన్‌వాడీ టీచర్లకు బోధన నైపుణ్యం పెంపొందించడం ద్వారా చిన్నారుల విద్య కొత్తరూపు సంతరించుకోనుంది.

పది ప్రాజెక్టులు.. 2,225 అంగన్‌వాడీలు

జిల్లాలో 10 ప్రాజెక్టుల పరిధిలో 2225 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1915 మంది టీచర్లు, సహాయకులకు విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సుశిక్షితులైన బోధకులుగా మారనున్నారు. చిన్నారులకు ఆటపాటలతో చదువుపై దృష్టి కేంద్రీకరించేలా వివిధ వస్తువులు బొమ్మలు, కళాకృతులు, చార్టుల రూపకల్పనలో జిల్లా టీచర్లు ముందున్నారు.





బోధనా సామగ్రి

దెందులూరు మండలం చల్లచింతలపూడి కేంద్రంలో ఈ రకంగా అందంగా బొమ్మలు తయారుచేసి పిల్లలను ఆకర్షిస్తున్నారు.

రానున్న సీజన్‌కు ఉపయుక్తం

వేసవి సెలవుల అనంతరం కొత్త విద్యా సంవత్సరం స్కూళ్లు తెరిచేలోపు అంగన్‌వాడీ టీచర్లు ఆట, పాటలు, బొమ్మలతో చిన్నారుల మనసుకు దగ్గరయ్యేలా శిక్షణ కొనసాగుతోంది. చిన్నారులు ఒకటో తరగతి విద్యను అందిపుచ్చుకునేలా కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. చిన్నారుల్లో సామర్థ్యాలు పెంపొందించేందుకు అవసరమైన మెళకువలు, ప్రాథమిక దశలోనే మెరుగైన విద్యనభ్యసించేలా అవగాహన కల్పిస్తున్నారు. మొదటి దశలో చిన్నారులు మేధోభి వృద్ధి, రెండో దశలో శారీరక అభివృద్ధి, మూడో దశలో భాషాభివృద్ధి, నాలుగు, ఐదు దశల్లో సాంస్కృతిక సృజనాత్మకత పెంపు తదితర అంశాలపై తరగతులను నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. మూడేళ్లలో ఏడాదికి 40 రోజుల చొప్పున శిక్షణ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నాణ్యమైన పౌష్టికాహారంతో బంగారు బాల్యానికి మంచి అలవాట్లు నేర్పే గుడిగా అంగన్‌వాడీ తయారు కానుంది.

శిక్షణతో ఆత్మవిశ్వాసం : ఐసీడీఎస్ పీడీ శారద

జిల్లా విద్యాశాఖ సహకారంతో ప్రతీ ఐసీడీఎస్ ప్రాజెక్టులో శిక్షణతో అంగన్‌వాడీ కార్యకర్తలలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది. వారిలో బోధనా నైపుణ్యాలు మెరుగుపడ్డాయి. పునశ్చరణ తరగతుల నిర్వహణతో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగైంది. పలు కేంద్రాలకు పిల్లలు రాక పెరుగుతుండడం శుభ పరిణామం.

నేటి నుంచి మద్యం బంద్

పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో

27 సాయంత్రం వరకు దుకాణాల మూత

ఏలూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 27న సాయంత్రం 4 గంటలకు మద్య నిషేధం అమలు చేస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య సోమవారం తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వుల మేరకు జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 141 మద్యం షాపులను మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25న సాయంత్రం 4 గంటల నుంచి ప్రచారం ముగిసిన వెంటనే మద్యం షాపులకు సీలు వేస్తామని, ఈ నెల 27న సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు నిషేధం అమలులో ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 బార్లు, 152 కల్లు దుకాణాలను బంద్ చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని ఆవులయ్య తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే షాపుల లైసెన్స్ రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.



జాలిపూడి సచివాలయంలో ఏలూరు ఎంపీడీవో తనిఖీ (ఫైల్)

బయోమెట్రిక్ బేఖాతర్

● సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది ● పలుచోట్ల విధులకు డుమ్మా!

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పలుచోట్ల విధులకు డుమ్మా కొడుతున్నారు. పౌర సేవలందించడంలో ఎంత క్రియాశీలకంగా ఉంటున్నారనేది పక్కన పెడితే అసలు సచివాలయానికే రాని పరిస్థితి నెలకొంది. పేరుకు సచివాలయ అడ్మిన్, సెక్రటరి ఉన్నప్పటికి మిగతా సిబ్బందిపై నియంత్రణ కొరవడింది.

గాడిన పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు

కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది. బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉదయం 10 గంటలకు బయోమెట్రిక్ హాజరు వేయాలి. క్షేత్రస్థాయి విధుల్లో ఉంటే మొబైల్ యాప్‌లో హాజరు వేయాలి. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరును సమీక్షిస్తున్నారు. అయినప్పటికీ కొందరు బయోమెట్రిక్ హాజరును బేఖాతరు అంటున్నారు. ప్రతి సోమవారం కలెక్టర్ నిర్వహించే సమీక్ష నివేదికలు పరిశీలిస్తే బయోమెట్రిక్ హాజరును సచివాలయ సిబ్బంది బేఖాతరు చేస్తున్నారన్న విషయం అర్థమవుతోంది. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 605 సచివాలయాలు ఉండగా, జనవరి, ఫిబ్రవరి వరకు సచివాలయ సిబ్బంది హాజరు వివరాలు అందాయి. 4,700 మంది ఉద్యోగులుంటే 4,396 మంది బయోమెట్రిక్ హాజరు వేశారు. ఇటీవల ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో ఒక్కరు కూడా కనిపించలేదు. ఎంపీడీవో శ్రీలత ఆగ్రహం వ్యక్తం చేసి అందరికీ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలోని సచివాలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.





నాటి క్షీరపురే... నేటి పాలకొల్లు


పాలకొల్లు అర్బన్ : పాలకొల్లుగా పేరుపొందిన పంచారామ క్షేత్రం ఒకప్పుడు క్షీరపురిగా పిలవబడేది. ఇక్కడ పరమేశ్వరుడు పార్వతీ సమేతంగా క్షీరా రామలింగేశ్వరునిగా కొలువు దీరారు. తారకాసురుడితో కుమార స్వామి యుద్ధం చేస్తున్న సమయంలో తారకాసురిని సంహరించగా అతని కంఠంలోని అమృత లింగం (శివలింగం) ఐదు ఖండాలుగా విడి ఐదు చోట్ల పడ్డాయి. శివుని పార్థివ లింగ భాగాలు పడిన ఈ ఐదు ప్రదేశాలకు ఆరామాలుగా పేరు వచ్చింది. పాలకొల్లులో క్షీరా రామలింగేశ్వరుడిగా కొలువుదీరాడు పరమేశ్వరుడు..

శ్రీరాముడు ప్రతిష్ఠించిన లింగం



కృతయుగంలో తారకాసురుడు అనే రాక్షసుడు పరమేశ్వరిని గురించి ఘోర తపస్సు చేయగా, శివుడు ప్రత్యక్షమై ఏమి కావాలని కోరుకోమనడంతో తనను స్త్రీ గర్భం నుంచి జన్మించని వాడి చేత మాత్రమే తాను మరణం పొందే విధంగా వరం కోరుకోవడంతో పాటు శివుని ఆత్మలింగం కూడా ఇవ్వమని కోరాడు. బోళా శంకరుడు తారకాసురునికి వరాలు ఇవ్వడంతో ఆత్మలింగాన్ని తన ఖంఠ హారంగా ధరించి వర గర్వంతో దేవతలను, మునులను బాధిస్తూండటంతో వారు అందరూ కలిసి విష్ణుమూర్తి వద్దకు వెళ్ళి మెర పెట్టుకున్నారు. స్త్రీ గర్భం నుంచి పుట్టనివాడు ఎవరా అని ఆలోచన చేయగా కుమారస్వామి అని తెలియడంతో తారకాసురుని మీదుకు కుమారస్వామిని యుద్ధానికి పంపించారు. తారకాసురుని వధించగా అతని మెడలోని శివుని పార్థివలింగం శిరోభాగం పడిన ప్రాంతమే క్షీరారామమని, శ్రీరాముడు స్వయంగా ప్రతిష్ఠించినట్టు పురాణాలు చెబుతున్నాయి.

-సన్నిధిరాజు రామకృష్ణ మూర్తి, అలయ ప్రధానార్చకుడు







ఉత్సవాలకు ముస్తాబైన పాతాళ భోగేశ్వరస్వామి ఆలయం.. పంచబుగ్గల కోనేరు

దక్షిణ కాశీగా పాతాళ భోగేశ్వరస్వామి క్షేత్రం

కలిదిండి : కలిదిండిలో పాతాళ భోగేశ్వరస్వామి పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా వెలుగొందుతున్నది. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశారు. ఈ ఆలయానికి విశిష్ట చరిత్ర ఉంది. వేంగిరాజు రాజరాజ చోళుడు పాలనా కాలంలో ఒక రైతు నాగలితో పొలం దున్నుతుండగా, నాగలి కర్రు తగిలి నెత్తురు వరదలై బయటపడ్డ స్వయం భూ లింగం ఆకారంలో ఉన్న స్వామివారిని బయటకు తీసి విరిగిన భాగాన్ని అతికించి నట్లు చెబుతారు. ఇప్పటికీ లింగాకారం భాగం ఒక పక్క విరిగినట్టుగా దానిని తిరిగి అతికించినట్టుగా కనిపిస్తుంది. ఈ ఆలయం కలిదిండికి 3 మైళ్ల దూరంలో పొలాల మధ్య ఉంది. కోడికూత..రోకలి పోటు వినలేను కనుక నా ఆలయాన్ని అక్కడే నిర్మించమని స్వామివారు భక్తులను కలలో కోరినట్లు చెబుతారు. లింగాకారం లభించిన చోటనే ఆలయ నిర్మాణం జరిగినట్లు చెబుతారు. ఆలయ ప్రాంగణంలో పవిత్రమైన పంచబుగ్గల కోనేరు ఉంది. దీనిలో పంచబుగ్గలు ఉన్నాయి. భక్తులు కోనేరు చెంతకు చేరి హరహరా అంటుండగా బుడబుడమంటూ నీరు పైకి రావడం నేటికీ కనిపిస్తుంది. శివరాత్రి పర్వదినాన సుమారు 2 లక్షల మంది ప్రతి ఏడాది హాజరవుతారు.


1100 ఏళ్ల నాటి ప్రాచీన దేవాలయం

కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి ఆలయాన్ని 1100 ఏళ్ల క్రితం నిర్మించారు. భూమి లోపల భాగంలో పాతాళంలో స్వయంభూ స్వామివారు ఉండటంతో పాతాళ భోగేశ్వరస్వామిగా పేరొందారు. కోడికూత రోకలి పోటు వినలేనని స్వామివారు భక్తుల కలలో కోరడంతో స్వామివారి లింగాకారం లభించిన చోటనే ఆలయాన్ని నిర్మించారు. ఒకరోజు స్వామివారి నిత్యార్చనకు జాప్యం జరగడంతో ధ్వజస్తంభం ఎక్కి చూడగా అర్చకుల రాకను గమనించి ధ్వజస్తంభంపై దూకడంతో స్వామివారి పాదాల గుర్తులు ఏర్పడటాన్ని నేటికీ ప్రత్యక్షంగా వీక్షించచ్చు.

మల్లికార్జునస్వామి, అర్చకుడు



శివరుద్రాయ



మహిమాన్వితం శైవక్షేత్ర దర్శనం
మహా శివరాత్రికి ఆలయాలు ముస్తాబు





శివరాత్రి సందర్భంగా విద్యుద్దీపాలంకరణలో ఆలయం

వర్ణాలు మారే గునుపూడి సోమేశ్వరస్వామి

భీమవరం టౌన్ : తారకాసురుడు అనే రాక్షసుడు పరమేశ్వరుని వర ప్రసాదంతో పొందిన అమృత లింగంను కంఠంలో ఉంచుకోవటంతో ప్రాణ రక్షణగా ఉండేది. దీంతో తారకాసురుడు అందరిని అనేక విధాలుగా బాధపెట్టేవాడు. రాక్షసుని బాధలు భరించలేక దేవతలు కుమరస్వామిని ప్రార్థించడంతో తన ఆగ్నేయ అస్త్రంతో ఉపాసనాలింగాన్ని ఐదు ఖండాలుగా చేధించడంతో ఐదు ప్రాంతాల్లో పడ్డాయి. గునుపూడిలో పడిన పార్థివ లింగ శకలాన్ని చంద్రుడు (సోముడు) ప్రతిష్ఠించి సోమేశ్వర స్వామిగా నామకరణం చేశారు. చంద్రుని ప్రతిష్ఠ కారణంగా లింగానికి చంద్రకళలు ఉన్నాయి. ఇక్కడ శివలింగం అమావాస్యకు గోధుమ వర్ణంలోను, పౌర్ణమికి శ్వేతవర్ణంలోను కనిపించడం విశేషం. శివరాత్రి సందర్భంగా 26 బుధవారం రాత్రి అఖండ దీపారాధన , స్వామి వారి గ్రామోత్సవం, తెల్లవారుజామున స్వామి వారికి, అమ్మవారికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.





నాటి మార్తాండపురమే నేడు ఆచంట క్షేత్రం

ఆచంట : దక్షిణ భారతావనిలో ప్రసిద్ధి గాంచిన పుణ్య క్షేత్రాల్లో ఆచంటేశ్వర క్షేత్రం ఒకటి. ఇది గోదావరి తీరానికి కొద్ది దూరాన గల పూర్వపు మార్తాండపురమే నేడు ఆచంటగా పేరుగాంచింది. తారకాసుర సంహారానంతరం శివ పార్వతులు విహరించు సమయంలో ముని దంపతులు శివసాయిజ్యం కోరి కైలాసమేగగా పరోక్షముగా తిలకించుట శివుడు గమనించి ఆ దంపతులను బాల బాలికలుగా చేస్తాడు. బ్రహ్మచర్యము ఆచరించిన అనంతరం శివ సాయిజ్యం పొందుతారని చెబుతాడు. శివుని ఆజ్ఞ పాటించనందున భూలోకమున తిరువల్లూరు గ్రామంలో బ్రాహ్మణను ఇంట పుష్ప సుందరుడు ఒడయ నంబిగా, మార్తాండపురుమున కళావంతుల ఇంట పుష్ప సుందరి పరమనాచిగానూ జన్మిస్తారు. ఒడయనంబి తీర్థయాత్రలు చేస్తూ మార్తాండపురం చేరతాడు. మార్తాండునికి నాట్యకళా ప్రదర్శనలు చేస్తూ ఉండగా ఒడయ నంబి, పరమనాచిలు శివ సంకల్ప బలముచే ఇద్దరూ ఈశ్వర సేవ చేస్తున్నారు. ఒకనాటి రేయి మహా శివరాత్రి పర్వదినమున ఆ దంపతులు సుఖనిద్రకు లోనై పూజా కార్యక్రమాలకు సమయం మించిపోవడంతో భక్తుడైన ఒడయనంబి, పరమనాచి స్థనాగ్రభాగమునే శివలింగముగా భావించి పూజలు చేస్తాడు. ఆ స్వామి స్థనాగ్రభాగమున వెలసిన కార ణంగా మార్తాండపురము కాలక్రమేణా ఆచంటీశ్వరునిగా పిలవబడుచూ విరాజిల్లుతున్నది. ఇక్కడ ప్రతీ ఏటా ఐదు రోజుల పాటు మహా శివరాత్రి మహోత్సవాలు వైభవపేతంగా జరుగుతాయి. వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చి ఆచంటీశ్వరుని దర్శించుకుంటారు.

చాళుక్య భీముడు నిర్మించిన భీమేశ్వరస్వామి ఆలయం

భీమవరం టౌన్ : భీమవరంలోని భీమేశ్వరస్వామి ఆలయాన్ని 9వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన చాళుక్యభీముడు నిర్మించినట్టు చెబుతారు. వారి కుల దైవం భీమేశ్వరస్వామి కావడంతో ఈ ఆలయంలో ప్రతిష్ఠించిన శివలింగాన్ని భీమేశ్వరస్వామిగా కొలుస్తున్నారు. ఈ దేవాలయం 890-918 సంవత్సర మధ్య కాలంలో నిర్మించినట్లుగా భావిస్తున్నారు. ఈ దేవాలయంలో లభించిన శిలలపై రాసిన ప్రకారం ఈ దేవాలయం చాళుక్యల కాలంలోనే నిర్మించినట్లుగా పురావస్తు శాఖ అధికారులు ధ్రువీకరించారు.



భక్తులను అనుగ్రహించేందుకు ఆ భోళా శంకరుడు ఎప్పుడూ సిద్ధమే.. నీలకంఠుడు.. భోళా శంకరుడు.. మహాదేవుడు.. ఎవరు ఎలా పిలిచినా అనుగ్రహిస్తాడు..హరహర మహాదేవ.. శంభోశంకరా.. అంటూ భక్తులు చేసే ప్రార్థన ఆ పరమశివునికి పరమానందం.. ఎన్నో శైవ క్షేత్రాలు.. ఆ పరమశివుని లీలలు తెలుసుకునేందుకు మహిమాన్విత క్షేత్రాలెన్నో.. ఒక్కో క్షేత్రంలో ఒక్కో విశిష్టత.. ఈ నెల 26న మహా శివరాత్రి.. ఈ వేడుకలకు శివాలయాలు ముస్తాబయ్యాయి..ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని వివిధ చరిత్ర ప్రసిద్ధ క్షేత్రాల విశిష్టత , ప్రాముఖ్యత గురించి తెలుసుకుందాం..

రేపటి సంచికలో మరిన్ని క్షేత్రాల వివరాలు

త్రిలింగ క్షేత్రంగా నత్తారామేశ్వరం

పెనుమంట్ర : పరశు రాముడు క్షత్రియులను సంహరించిన దోష పరిహారార్థం క్రౌంచ పర్వతాన్ని ఛేదించి శివలింగాన్ని తీసుకువచ్చి ఓంకార శబ్దం వినిపించే చోట ప్రతిష్ఠించాలని మునీశ్వరులు చెప్పడంతో గోస్తనీ నది గర్భంలో ఋషులు మహ మునీశ్వరులు తపస్సు చేయడంతో అదే ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. ఉగ్రరూపుడైన పరశురాముడు ప్రతిష్ఠించిన కారణంగా నిత్యం అగ్నికీలలతో మండుతున్న శివలింగం 11 నెలల పాటు నీటిలో ఉండి ఒక్క వైశాఖమాసంలోనే దర్శనమిస్తుంటాడు.. సీతా సమేత రామ చంద్రస్వామి ఈ ప్రాంతాన్ని సందర్శించి హిమాలయ పర్వతాల నుంచి శివలింగాన్ని తీసుకురావాలని ఆంజనేయస్వామిని ఆదేశించగా ముహూర్త సమయానికి ఆంజ నేయస్వామి రాకపోవడంతో నిత్య పుష్కరిణి గోస్తనీనదిలోని ఇసుక, నత్త గుల్లలు, ఒంద్రు మట్టి మిశ్రమంతో దీర్ఘ చతురస్రాకారంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి రామేశ్వరుడిగా నామకరణం చేశారు. ఇసుక నత్త గుల్లలు ఒంద్రు మట్టి మిశ్రమంతో చేయడంతో నత్త రామేశ్వరంగా ఈ గ్రామానికి పేరు వచ్చింది. గోస్తనీ నది అవతల ఒడ్డున లక్ష్మణుడు ఈశ్వరుని ప్రతిష్ఠించుట చేత లక్ష్మణేశ్వర స్వామిగా పూజలందుకుంటున్నారు. ఒకే ప్రాంతంలో మూడు శివలింగాలు ఉండుట చేత ఈ ప్రాంతం త్రిలింగ క్షేత్రంగా భక్తుల పూజలు అందుకుంటుంది.



భక్తులు తాకే మొగల్తూరు అడవి మల్లికార్జునుడు

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ పరిధి అడవి ప్రాంతంగా ఉండే వడయార్ పేటలోని వనాల మధ్య స్వామివారు వెలవడంతో అడవి మల్లికార్జునుడుగా, వనాల మధ్య ఈ విగ్రహం ఉండటంతో వనమల్లిఖార్జునుడుగా భక్తులు పిలుస్తుంటారు. స్వామి వారి విగ్రహాన్ని భక్తులు నేరుగా తాకి స్వయంగా పూజలు చేసుకునే అవకాశం ఉండటంతో స్వయంభూలింగేశ్వర వనమల్లి కార్జునుడుగా ఈ ఆలయం ప్రసిద్ధి కెక్కింది. శ్రీశైలం తరువాత శివలింగాన్ని నేరుగా భక్తులు ముట్టుకుని పూజించే అవకాశం ఇక్కడ మాత్రమే ఉంది. సాధువులు ఇక్కడ ఉంటూ పక్కన ఉన్న కోనేరు నుంచి నీరు తీసుకువచ్చి స్వామివారికి నిత్యం అభిషేకం చేసేవారు. ఆ సమయంలో మొగల్తూరు కోట సంస్థానంలో ఈ స్వామివారిని పూజించేందుకు దూరం కావడంతో ఈ విగ్రహన్ని తీసుకువెళ్ళి కోట వద్ద ప్రతిష్ఠించేందుకు నాటి పాలకులు ప్రయత్నించినా ఫలించలేదని పూర్వీకులు తెలిపేవారు. విగ్రహం తీసుకువెళ్లేందుకు విగ్రహం చుట్టూ తాడిచెట్టులోతు తవ్వినా విగ్రహం అంతం కనపడలేదని తవ్వే క్రమంలో స్వామివారి విగ్రహానికి గుణపపు పోట్లు తగలి రక్తం కారడంతో ఈ విగ్రహాన్ని తీసుకువెళ్ళే ప్రయత్నాన్ని విరమించుకునట్టు కథనం. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండటమే ఈ స్వయంభూ లింగేశ్వరుడుకు ఇష్టమని భక్తులు చెబుతారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ ఆలయంపై వేసిన చలువ పందిర్లు అగ్నికి ఆహుతవడంతో నాటి నుంచి శివరాత్రి సమయంలో వేసే చలువ పందిర్లు సైతం వేయరు. శివరాత్రి, కార్తీకమాసంలో ప్రత్యేక పూజలు స్థానిక వడయార్ సంఘం ఆధ్వర్యంలో 8 దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు.



శ్రీరాముడు ప్రతిష్ఠించిన బలివే రామలింగేశ్వరుడు

ముసునూరు : బలివే రామలింగేశ్వర స్వామి ఆలయం దక్షిణ కాశీగా వెలుగొందుతోంది. త్రేతాయుగంలో శ్రీరాముడు చేత లింగప్రతిష్ఠ జరిగినట్లు చరిత్ర చెబుతోంది. ప్రతి ఏటా ఐదురోజులు పాటు మహాశివరాత్రి మహోత్సవాలను వైభంగా నిర్వహిస్తారు. లక్షల్లో భక్తులు తరలివచ్చి తమ పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేసి, తర్పణాలు వదలి, తమ్మిలేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. శ్రీరాముడు రావణ సంహరణం అనంతరం బ్రహ్మహత్య దోష నివారణార్థం మహా స్థలాలను ఎంచుకుని ఈశ్వర లింగ ప్రతిష్ఠ చేసుకుంటూ అయోధ్య చేరడానికి ముందు మహా అరణ్యమైన ఈ స్థలంలో ఆహ్లాదకర మైన వాతారవణం, శివధ్యాన దృష్టి గల భూమిగా గ్రహించి లింగప్రతిష్ఠ చేసినట్టు పురాణ కథనం. తదనంతరం బలిచక్రవర్తి ఈ ప్రాంతాన్ని పరిపాలించడంతో ఈ ప్రదేశానికి బలివే పేరు శాశ్వతమై, స్వామివారిని భక్తులు బలేరామస్వామిగా పిలుస్తూ ఉన్నారు. ఈ గ్రామ పరిసర ప్రాంతాలలో పూర్వం 101 లింగప్రతిష్ఠలు ఉండేవి. కాలక్రమేణా అవి శిథిలాలు కాగా, వీటిలో సుమారు ఐదు శివలింగాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనది శ్రీ మృత్యు మల్లేశ్వర స్వామి వారి దేవాలయం. రామలింగేశ్వర స్వామి దేవాలయానికి ఒక కిలోమీటరు దూరంలో తాతగుడిగా ఈ ఆలయాన్ని పిలుస్తారు. స్వామివారి రథోత్సవం నాడు తాతగుడికి వెళ్ళి ఆశీర్వాదం తీసుకునే సంప్రదాయం తరతరాలుగా ఉంది. 12వ శతాబ్దంలో నూజివీడు ప్రభువుల మూల పురుషుడు మేకా బసవ దండనాథులు పునఃనిర్మాణం చేసినట్లు ఆలయంపై శిలాఫలకం అనవాళ్ళు ఉన్నాయి.



మహిమాన్వితుడు రామలింగేశ్వరుడు



రామలింగేశ్వరస్వామి భక్తుల కోర్కెలు తీర్చే మహిమగల స్వామిగా విరాజిల్లుతున్నారు. ప్రతి రోజు స్వామివారికి విశేష పూజలు జరుగుతాయి. మహాశివరాత్రి ఉత్సవాలు ఐదురోజులు స్వామివారి దర్శనానికి భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తారు. మా వంశీకులు రెండు తరాల నుంచి ఆలయంలో అర్చకులుగా పనిచేశారు. ప్రస్తుతం మూడో తరంలో నేను ఉన్నాను.

- తోలేటి అరుణ భాస్కరరావు, ప్రధాన అర్చకుడు

రెడ్డిరాజులు నిర్మించిన ఆలయం..

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి వారు 100 సంవత్సరాల ఉత్సవాలకు ముస్తాబవుతున్నారు. స్వామివారి ఆలయానికి ప్రాచీన చరిత్ర ఉంది. శ్రీకృష్ణదేవ రాయల సామ్రాజ్యంలో రెడ్డిగణపవరం కేంద్రంగా చేసుకుని రెడ్డిరాజులు పాలన చేశారు. అందుకే ఈ ప్రాంతానికి రెడ్డిగణపవరంగా పేరు వచ్చింది. 11వ శతాబ్దంలో గణపతిరెడ్డి తన విజయాలకు సూచికగా రెడ్డిగణపవరంలో కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించి నిత్యం పూజలు చేసేవారు. స్వామివారి ఆలయంలో క్రమం తప్పకుండా ఏటా ఉత్సవాలు జరిగేవి. ముస్లింలు దండయాత్రలు చేసి స్వామివారి ఆలయాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. 1925లో భౌమరాజు రామకృష్ణంరాజు, భౌమరాజు షేతురత్నంరాజులు స్థానిక గిరిజనులు, గ్రామస్తుల సహకారంతో స్వామి వారి ఆలయాన్ని పునర్నిర్మించి ఏటా హోళి పౌర్ణమి రోజునుంచి ఐదు రోజులపాటు జాతర నిర్వహిస్తున్నారు. ఇక్కడ జరిగే జాతర ఉత్సవాలకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు ఇతర ప్రాంతాలు, జిల్లాలకు చెందిన భక్తులు కూడా అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ కనకదుర్గ అమ్మవారికి సంతానలక్ష్మీగాను స్వామివారిని కోర్కెలు తీర్చే స్వామిగా భక్తులు నమ్ముతారు. రెడ్డిరాజులు చుట్టుపక్కల గ్రామాలతో పాటు అనేక ప్రాంతాల్లో 102 శివాయాలను నిర్మించినట్టు తమ పూర్వీకులు చెప్పి నట్టు ఆలయ ధర్మకర్తలు భౌమరాజు ధనుం జయరాజు, భౌమరాజు సత్యన్నారాయణ రాజు తెలిపారు.



రెడ్డిగణపవరంలో విశ్వేశ్వరస్వామి



11వ శతాబ్దం నాటి ఆలయ ముఖ మండపం

205 సంవత్సరాల చరిత్ర గల కోనాల సోమేశ్వర ఆలయం

తణుకు రూరల్ : తణుకు రూరల్ మండలం కోనాల సోమేశ్వరస్వామి ఆలయానికి 205 సంవత్సరాల చరిత్ర వుంది. ధర్మ అప్పారావుగా ఖ్యాతి పొందిన నూజివీడు సంస్థానాధీశుడు వెంకట నరసింహ అప్పారావు 1820 సంవత్సరంలో కోనాలలో సోమేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. దూప, దీప నైవేద్యాల నిమిత్తం ఆలయానికి సుమారు 20 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. ఈ ఆలయాన్ని పరిరక్షించుటకు అప్పట్లో దేశ పాండ్యులుగా పనిచేస్తున్న తల్లాప్రగడ వంశీయులను ధర్మకర్తలుగా, యలమంచిలి వంశీయులను అర్చకులుగా నియమించినట్లు శాసనాల ద్వారా తెలుస్తున్నది. అప్పటి నుంచి తల్లాప్రగడ వంశీయుల ధర్మకర్తల ఆధ్వర్యంలో యలమంచిలి వారి ఆర్చకత్వంలో ఆలయంలో శివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు.






యాగశాలలో సాలగ్రామాలకు అభిషేకాలు.. కలశారాధనకు సిద్ధంగా కలశాలు

లక్ష్మీ నారసింహుడికి అభిషేకాలు

రేపు సుదర్శన నృసింహ మహాయజ్ఞం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై కొలువుదీరిన లక్ష్మీనారసింహుని సన్నిధిలో జరగనున్న అతిరుద్ర ప్రయోగ సహిత సుదర్శన నృశింహమహాయజ్ఞం సందర్భంగా సోమవారం ఆలయంలో విశేష కార్యక్ర మాలు జరిగాయి. ఈక్రమంలో ఉదయం ఆలయ యాగశాలలో మండపారాధన, నిత్యహోమం నిర్వహించారు. అంతకు ముందు మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు జరిగాయి. అనంతరం సాలగ్రామ అభిషేకాలు, ఆ తరువాత ఉపనిషత్ పూర్వక లక్ష్మీగణపతి మూల మంత్ర సహిత అష్టద్రవ్య హోమాన్ని పండితులు, రుత్వికులు నిర్వహించారు. ఈయజ్ఞ నిర్వాహకులు కొచ్చర్లకోట నరసింహగురూజీ ఆలయ యాగశాలలో ఈ యజ్ఞక్రతువుకు శ్రీకారం చుట్టారు. అనంతరం రుద్రహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినమైన ఈ నెల 26 సాయంత్రం నుంచి తెల్లవార్లూ ఈ 31వ అతిరుద్రప్రయోగ సహిత సుదర్శన నృశింహమహాయజ్ఞం అట్టహాసంగా జరుగుతుందని భక్తులు తరలిరావాలని నిర్వాహకులు నరసింహగురూజీ, సివి కుటుంబరావు కోరారు.

ద్వారకాతిరుమలలో అరుదైన పక్షి

హనుమంత వాహనంపై దర్శనం




ఆలయంలో హనుమంత వాహనంపై వాలిన పక్షి... అరుదుగా కనిపించే ఇండియన్ నైట్జార్ పక్షి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి): అరుదుగా కనిపించే ఇండియన్ నైట్జార్ పక్షి చినవెంకన్న ఆలయంలో కనిపిం చింది. ఇది కాస్త వింతగా ఉండటంతో భక్తులు దీన్ని ఆసక్తిగా తిలకించారు. ఇది దక్షిణ ఆసియా, ఆగ్నేయాసియా ప్రాంతాల్లో కనిపి స్తుంది. రాత్రివేళల్లో చురుకుగా ఉంటుంది. పొడవైన కోణాలతో ఉండే రెక్కలు, చిన్న పాదాలతో ఉంటుంది. ఇది ఎండిన చెట్టు కొమ్మలపై ఎక్కువగా వాలుతుంది. ఎటూ కదలకుండా ఉంటుంది. చెట్టుకొమ్మ రంగులో కలిసిపో తుంది. ఈ పక్షికి దగ్గరగా వెళ్ళినప్పటికీ శత్రు పక్షులు ఈ పక్షిని కని పెట్టలేవు. ఎక్కువగా రాత్రి సమయాల్లో వేట సాగిస్తుంది. ఇది ప్రధాన ఆలయంలో ఆర్జిత బ్రహ్మోత్సవం జరిగే ప్రాంతంలో దర్శనమిచ్చింది. హనుమంత వాహన ంపై కూర్చుని ఉన్న ఆ పక్షి ఎగరలేక కిందకు దూకింది.


నేటి నుంచి వీరంపాలెంలో శివరాత్రి ఉత్సవాలు



విద్యుత్ కాంతుల్లో వీరంపాలెం క్షేత్రం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభం కానుండగా రాత్రి శ్రీచక్రార్చన నిర్వహించనున్నారు. 26 తెల్లవారు జామున స్ఫటిక లింగానికి 12 నదీజలాలతో అభిషేకం, ఉదయం 5 గంటల నుంచి భక్తులకు దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. అదే రోజు 45 అడుగుల ఎత్తున మహాదేవుడికి మహాకుంభాభిషేకం చేస్తారు. సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలతో ప్రవచనాలు, లక్ష దీపోత్సవం, జ్యోతిర్లింగార్చన, రాత్రికి భక్తులు జాగరణ చేసేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 27న శాంతి కల్యాణం, ఊరేగింపు నిర్వహిస్తారు. భక్తులకు వసతులు కల్పిస్తున్నామని ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకట రమణ సిద్ధాంతి తెలిపారు. తాడేపల్లిగూడెం బస్ డిపో నుంచి శివరాత్రి రోజు ప్రతి 10 నిముషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని వివరించారు.

శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి వర ప్రసాద్

ఏలూరు క్రైం/భీమవరం టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా భక్తుల సౌకర్యార్థం శైవ పుణ్య క్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వీఆర్ వర ప్రసాద్ చెప్పారు. ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం నుంచి 27వ తేదీ వరకూ 40 ప్రత్యేక బస్సులను ఏలూరు డిపో నుంచి బలివే క్షేత్రానికి నడుపుతున్నట్లు చెప్పారు. ఆ రోజు ద్వారకాతిరుమల పాదయాత్రకు వెళ్ళే భక్తుల సౌకర్యార్థం ద్వారకాతిరుమల నుంచి తిరిగి ఏలూరు రావడానికి 25 బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా తాడేపల్లిగూడెం సమీపంలోని వీరంపాలెంలో ఉన్న స్ఫటిక శివలింగదర్శనానికి ఏలూరు నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో విశేషమైన పట్టిసీమకు జంగారెడ్డిగూడెం నుంచి 36 బస్సులు, జంగారెడ్డి గూడెం మండలంలోని తాడువాయికి మూడు బస్సులు 25వ తేదీ మధ్యాహ్నం నుంచి 27వ తేదీ ఉదయం వరకూ బస్సులు నడపడం జరుగుతుందన్నారు. నూజివీడు డిపో నుంచి బలివే క్షేత్రానికి 15 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఈ బస్సులు 25వ తేదీ మధ్యాహ్నం నుంచి 27వ తేదీ మధ్యాహ్నం వరకూ నడుపబడతాయని అన్నారు. తాడేపల్లిగూడెం, నర్సాపురం నుంచి ఆచంట శ్రీ రామలింగేశ్వర క్షేత్రానికి 26 తేదీ ఉదయం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. తణుకు నుంచి నత్తారామేశ్వరం క్షేత్రానికి 26వ తేదీ ఉదయం నుంచి ప్రత్యేక బస్సులునడుస్తాయన్నారు.

న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అడ్వకేట్స్ అమెండ్మెంట్ బిల్లును వ్యతిరేకిస్తూ ఏలూరు అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఏలూరు బార్ అధ్యక్షుడు కోనే సీతారామారావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈనెల 25వ తేదీన మంగళవారం కూడా కోర్టు విధులు బహిష్కరించనున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అడ్వకేట్స్ అమెండ్మెంట్ బిల్లు వల్ల న్యాయవాదులకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆ బిల్లును నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

పోలింగ్‌కు సన్నద్ధం కావాలి : ఆర్వో వెట్రిసెల్వి

ఏలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ నెల 27న జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడానికి అధికారులు సర్వసన్నద్ధం కావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె వెట్రిసెల్వి ఆదేశించారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి కలిసి సోమవారం సమీక్షించారు. పోలింగ్‌కు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, చెక్‌లిస్టు ప్రకారం ఎన్నికల సామగ్రి పంపిణీ జరగాలన్నారు. రిసెప్షన్ సెంటర్ వద్ద మెడికల్ క్యాంపు, ఫైర్ ఎక్విప్‌మెంట్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. ఓటు వేయడంపై కూడా ఓటర్లకు అవగాహన కలిగించాలన్నారు. పోలింగ్ సిబ్బంది నియామకాలను మరోసారి పరిశీలించుకోవాలన్నారు. ఈ ఎన్నికలకు 456 పోలింగ్ కేంద్రాలకు 71 జోన్లకు జోనల్ అధికారులను, 99 మంది రూట్ అధికారులను నియమించామన్నారు. డీఆర్వో వి విశ్వేశ్వరరావు, అదనపు ఎస్పీ నక్కా సూరచంద్రరావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థులతో సమావేశం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థులంతా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా సహకరించాలని కె.వెట్రి సెల్వి కోరారు. కలెక్టరేట్‌లో ఎన్నికల ఏర్పాట్లపై అభ్యర్థులతో ఆమె సోమవారం రాత్రి సమీక్షించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ కౌంటింగ్ ఏజెంట్ల నియమాకాన్ని ఈ నెల 25వ తేదీ కల్లా అందిస్తే, అనంతరం పోలీస్ విచారణ చేపట్టి పాస్‌లు జారీ చేస్తామన్నారు.

పారదర్శకంగా ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

28 టేబుల్స్... 17 రౌండ్ల కౌంటింగ్‌కు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు సీఆర్ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో వచ్చే నెల 3వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపును పారదర్శకంగా జరిగేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎన్నికల పరిశీలకులు సీహెచ్ శ్రీధర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి సూచించారు. సర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపుపై సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో శ్రీధర్ మాట్లాడారు. ఓట్ల లెక్కింపుపైన పూర్తి అవగాహన కలిగి ఉండి, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో చేపట్టాలన్నారు. వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక దశ ఓట్ల లెక్కింపు, డీ టైల్డ్ కౌంటింగ్, రిజెక్టెడ్, డౌట్‌ఫుల్ ఓట్లు, కౌంటింగ్ ఏజెంట్లు తదితర అంశాలపై సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. మార్చి 3న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుందని, కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం 6 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, మొత్తం 3,14, 984 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు. ఈ ఓట్ల లెక్కింపు మూడు రోజులు జరిగే అవకాశం ఉందని, దీనికి షిఫ్టులు వారీగా ఓట్ల లెక్కింపు సిబ్బందిని నియమించామన్నారు. ఓట్ల లెక్కింపునకు 28 టేబుల్స్ 17 రౌండ్లు నిర్వహించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీవో అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్, ఏఈఆర్వోల వద్ద ఓటర్ల జాబితాలు

తూర్పు- పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా (నామినేషన్ చివరిరోజు వరకు ఆమోదం పొందిన ఓటర్ల జాబితా)ను తమ కార్యాలయంలోను, అందరూ ఏఈఆర్వోల కార్యాలయాల్లో ఓటర్ల సౌకర్యార్థం వారి పేర్ల పరిశీలనకు పొందుపరిచినట్లు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె వెట్రిసెల్వి తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యార్థులు డబ్బులిచ్చి మోసపోవద్దు : డీఈవో

'ఓపెన్' ఇంటర్ పరీక్షాకేంద్రాల సీఎస్‌లు, డీవోలతో సమావేశం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మార్చి 3వ తేదీ నుంచి 15 వరకు జరుగనున్న ఏపీ సార్వత్రిక విద్యాపీఠం(అపోస్) దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఏలూరు జిల్లా డీఈవో వెంకట లక్ష్మమ్మ ఆదేశించారు. జిల్లాలో ఓపెన్ స్కూల్స్ ఇంటర్ పరీక్షలు జరిగే కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సోమవారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు(అభ్యాసకులు) ఎవరిమాటలను నమ్మి మోసపోవద్దని, డబ్బులు ఇవ్వొద్దని విస్పష్టంగా తెలియజేయాలని కోరారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.శ్రీకాంత్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఏవైనా తేడాలొస్తే బాధ్యులను కాపాడేవారెవరూ ఉండరని, ఎవరిపైనా జాలిపడాల్సిన అవసరంలేదని హెచ్చరించారు. పరీక్షలు జరిగేటపుడు విద్యాశాఖ నియమించిన స్క్వాడ్ బృందాలతోపాటు, ఇతరశాఖల అధికారులు, తహసీల్దార్లు కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తారని వివరించారు. డీఈవో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలపై డైలమా!

ఓపెన్ స్కూల్స్ ఇంటర్ పరీక్షలపై డైలమా నెలకొంది. గతేడాది డిసెంబరు వరకు తత్కాల్ స్కీంపై అడ్మిషన్లు తీసుకున్న నేపథ్యంలో ఇంత వరకు సిలబస్ పూర్తికాలేదని, అడ్మిషన్ ఫీజులు చెల్లించిన అభ్యాసకులకు స్టడీ మెటీరియల్‌ను కూడా అందజేయకుండా వార్షిక పరీక్షలు నిర్వహించడం అభ్యంతరకరమంటూ రాష్ట్రంలోని పలు ఓపెన్‌స్కూల్స్ స్టడీసెంటర్ల(ఏఐ) కో-ఆర్డినేటర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తొలుత సింగిల్ జడ్జి కోర్టును ఆశ్రయించగా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనికనుగుణంగానే మార్చి 3నుంచి రెగ్యులర్ ఇంటర్మీడియట్ విద్యార్థులతోపాటే ఓపెన్‌స్కూల్స్ ఇంటర్ అభ్యాసకులకు కూడా పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాల పంపిణీ, సిబ్బంది నియామకాలు కూడా జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి కోర్టుఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ పలువురు ఏఐ కో-ఆర్డినేటర్లు హైకోర్టు ధర్మాసనాన్ని ఆశ్రయించారు. సోమవారం కోర్టులో వాదనలు జరుగుతున్నందున పరీక్షల నిర్వహణపై కోర్టు నిర్ణయం ఎలా ఉంటుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

3 నుంచి 'పది' విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నతపాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు మార్చి 3 నుంచి 13వ తేదీ వరకు గ్రాండ్ టెస్ట్ పరీక్షలను నిర్వహించాలని పాఠశాలవిద్య ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సబ్జెక్టుకు వందమార్కుల వంతున జరిగే ఈ పరీక్షలను నిర్దిత రోజుల్లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 4.45 గంటల వరకు నిర్వహిస్తారు. మార్చి 3న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1, 4న సెకండ్ లాంగ్వేజ్, 5న ఇంగ్లీషు, 6న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ -1, 7న గణితం, 10న ఫిజికల్ సైన్స్ (50మార్కులు). 11న బయోలాజికల్ సైన్స్ (50 మార్కులు), 12న ఓఎస్ఎస్‌సీ పేపర్-2, ఒకే షనల్ కోర్సు, 13న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహిస్తారు. మండల రిసోర్స్ సెంటర్లలో భద్ర పరిచే ప్రశ్నపత్రాలను సంబంధిత హైస్కూళ్ళకు ఆయా పరీక్షలు జరిగే రోజుల్లో ఒక గంట ముందుగా అందజేసే బాధ్యతలను ఎంఈవో-1,2, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీలకు అప్పగించారు. పరీక్ష నిర్వహణ ఎంఈవో, సీఆర్పీలు చూడాలని సూచించారు.

కోళ్ల వ్యర్థాల వాహనాలు పట్టివేత

పెదపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను వాహనాల్లో తీసుకువస్తుండగా సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి రెండు ఐషర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహనాలు, అందులోని చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని, వాటిలోని చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించామన్నారు. వాహన, చెరువు యజమానులతో పాటుగా డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పొగాకు క్యూరింగ్‌ను పరిశీలిస్తున్న వేలం అధికారి బి.శ్రీహరి

ఆశాజనకంగా పొగాకు ధరలు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కూడా వర్జీనియా పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండొచ్చని జంగారెడ్డి గూడెం పొగాకు వేలం అధికారి బి.శ్రీహరి తెలిపారు. సోమవారం ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించిన ఆయన పొగాకు క్యూరింగ్ పనులను పరిశీలించారు. క్యూరింగ్ సమయంలోను, గ్రేడింగ్ సమయాల్లో రైతులు బోర్డు సూచనలను, నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. అన్యపదార్థాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీలో క్యూరింగ్ కోసం అనుమతులు లేకుండా నిర్మించిన 190 బ్యారన్లను గుర్తిం చామని వాటిపై చర్యలకు ఉన్నతాధి కారులకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యూరింగ్ ఎస్‌జీవో సుధీర్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న వ్యాన్

పన్నెండు మందికి తీవ్ర గాయాలు



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాకుంభమేళ, పలు పుణ్య క్షేత్రాలు దర్శించుకుని వస్తుండగా డ్రైవర్ నిద్రపోవడంతో వ్యాను డివైడర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో 12 మంది గాయాల పాలయ్యారు. కర్ణాటక రాష్ట్రం పోలారి జిల్లా మలబాగి తాలూకా చామరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 12 మంది మహాకుంభమేళా వెళ్ళేందుకు ఒక టెంపో వ్యానును మాట్లాడుకున్నారు. మహాకుంభమేళా, కాశీ, మంత్రాలయం దర్శనాలు చేసుకుని తిరిగి వస్తూ అన్నవరం దర్శనం కూడా చేసుకుని ఆదివారం రాత్రి ప్రయాణం అయ్యారు. విజయవాడకు వస్తుండగా మార్గమధ్యలో నల్లజర్ల మండలం దూబచర్ల వద్ద సోమవారం తెల్లవారు జామున ఆ వ్యాను డ్రైవర్ నిద్రించడంతో ఆ వ్యాను డివైడర్‌ను ఢీ కొంది. ప్రమాదంలో కర్ణాటకకు చెందిన 12 మందికి గాయాలయ్యాయి. వీరందరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం వారి కర్ణాటక రాష్ట్రానికి ప్రత్యేక వాహనంలో వెళ్ళిపోయారు. ఈసంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి వైద్యులకు సమాచారం ఇచ్చారు.

బస్సు నుంచి జారిపడి గాయాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : బస్సు ఎక్కుతుండగా డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వడంతో ఒక వృద్ధురాలు జారిపడడంతో తీవ్ర గాయాలకు గురైంది. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటకు చెందిన అన్నవరపు రమాదేవి (60) పెదవేగి మండలం కూచింపూడి గ్రామంలో జాతర జరుగుతుండడంతో అక్కడ ఉన్న బంధువులు అయిన అన్నవరపు భాగ్యలక్ష్మి ఇంటికి రమాదేవి వచ్చారు. తిరిగి సోమవారం సాయంత్రం ఏలూరు వెళ్ళడానికి బస్సు ఎక్కుతుండగా డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వడంతో జారిపడి తీవ్ర గాయాలకు గురైంది. రమాదేవిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

స్పా కేసులో మరో నిందితుడు అరెస్టు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్పా మసాజ్ సెంటర్ పేరుతో వ్యభిచారం నిర్వహించడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు ఈనెల 11వ తేదీన దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. ఈకేసులో నాల్గో నిందితుడైన నిడదవోలు భాను ప్రసాద్ అలియాస్ భానును సోమ వారం అరెస్టు చేశారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి కింద ఆర్‌ఆర్‌పేట రోడ్డులో ఒక భవనంలో ఎస్ఎస్ బ్యూటీ సెలూ న్ అండ్ స్పా మసాజ్ పేరుతో నమ్మిన నాగార్జున అతని భార్య శివదుర్గ నిర్వహిస్తున్నారు. కొంతమంది యువ తులకు బ్యూటీషన్ శిక్షణ పేరుతో వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారని, క్రాస్ మసాజ్ చేయిస్తున్నారని సమాచారంతో పోలీసులు దాడి చేశారు. నాగార్జునతోపాటు అతని భార్య శివదుర్గ మరో మహిళ ఉర్ల దివ్యలను అరెస్టు చేశారు. ఏలూరు పత్తేబాదనకు చెందిన నిడదవోలు భాను ప్రసాద్ అలియాస్ భాను, ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన మద్దు నరేంద్రబాబు అలియాస్ నరేంద్రలపై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి భాను ప్రసాద్, నరేంద్రబాబు పరారీలో ఉన్నారు. భాను ప్రసా ద్‌ను అరెస్టు చేసి సోమవారం రాత్రి ఏలూ రులోని సెకెండ్ ఎజెఎఫ్‌సిఎం కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా మార్చి 10వ తేదీ వరకూ రిమాండ్ విధించారు.



క్రీడాకారులతో వీసీ నరసింహం తదితరులు

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ క్రీడా పోటీలు

పెంటపాడు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ (విజయవాడ) వైస్ చాన్స్‌లర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. సోమవారం ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియోపతి కళాశాలలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళా శాలల క్రీడా పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ నరసింహం తొలుత జాతీయ జెండాను ఎగుర వేసి అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. పోటీలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఏఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్, క్రీడా పోటీల చైర్మన్ డాక్టర్ యూఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. త్రినిటి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ విజయ్‌సృజిత్, ఎన్టీఆర్ యూనివర్సిటీ క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ త్రిమూర్తి తదితరులు మాట్లాడారు. ఈ పోటీలకు పురుషుల విభాగంలో వాలీ బాల్ (18 జట్లు), క్రికెట్ (15 జట్లు), బ్యాడ్మి ంటన్ (20జట్లు), టేబుల్ టెన్నిస్ (7జట్లు), చెస్(15జట్లు), అథ్లెటిక్స్ (18 జట్లు) పాల్గొనగా, మహిళల విభాగంలో వాలీబాల్(6జట్లు), త్రోబాల్(12జట్లు), టేబుల్ టెన్నిస్ (4జట్లు) చెస్ (8జట్లు), అథ్లెటిక్స్ (10జట్లు) పాల్గొం టున్నాయి.



ఎమ్మెల్యే నాయకర్‌కు అస్వస్థత

ఆసుపత్రికి తరలింపు

నరసాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజుల నుంచి ఆయన జ్వరంతో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటున్నారు. సోమవారం ఉదయం జ్వరం, చలి తీవ్రత పెరగడంతో కుటుంబ సభ్యులు ఆయనను పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షలు చేసిన వైద్యులు ఆయనకు టైఫాయిడ్‌గా నిర్ధారించారు. మధ్యాహ్నం వరకు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. అక్కడి నుంచి భీమవరంలోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం ఆదివారం అమరావతిలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిర్వహించే ఎమ్మెల్యేల సమావేశానికి హాజరు కావల్సి ఉంది. అయితే జ్వరంతో ఆయన వెళ్ళలేకపోయారు. సోమవారం ఉదయం అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని బావించినా జ్వరంతో వెళ్ళలేకపోయారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను ప్రభుత్వ సలహదారు ఎం.ఏ షరీఫ్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, టీడీపీ నరసాపురం ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు తదితరులు పరామర్శించారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని బ్లేడుతో దాడి

భీమవరం క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని అడగ్గా లేవన్నందుకు ఒక వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు బ్లేడుతో దాడి చేశారు. టూటౌన్ ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం మండలం నరసింహాపురం గ్రామానికి చెందిన తామరపల్లి రాజు భీమవరం పాత బస్టాండ్ సమీపంలోని ఒక బార్‌లో ఆదివారం రాత్రి మద్యం సేవిస్తున్నాడు. అదే సమయంలో నరసింహాపురం గ్రామానికి చెందిన బల్లిపోగుల గాంధీ కొవ్వాడకు చెందిన కొవ్వాడ జాను ఇద్దరు వచ్చి మద్యానికి డబ్బులు అడిగారు. లేవన్నందుకు తామరపల్లి రాజుపై బ్లేడుతో ఇష్టానుసారంగా దాడి చేసి గాయపరిచారు. తీవ్ర గాయాలైన రాజును ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటరావు తెలిపారు.

మోటార్ సైక్లిస్టు దుర్మరణం



కొయ్యలగూడెం, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం గ్రామాల మధ్య జరిగింది. ఈ ప్రమాదంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం చిల్లగుంపూరు గ్రామానికి చెందిన ఉప్పల వెంకట శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతుడు దమ్మపేట నుంచి తాడేపల్లిగూడెం వెళ్ళి అక్కడ సంతపనులు చూసుకుని తిరిగి మోటార్ సైకిల్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్‌లారీ ఢీకొంది. మృతుడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తాడని తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కైకరంలో రోడ్డు ప్రమాదం

ఉంగుటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కైకరం వద్ద సోమవారం కైకరం గ్రామానికి చెందిన నాగేశ్వరరావును ఏలూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. నాగేశ్వరరావును తొలుత అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించారు.

వేసవిలో రెండు పూటలా తాగునీరందిస్తాం

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వేసవిలో రెండు పూటల సమృద్ధిగా తాగునీరందిస్తామని ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. దెందులూరులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును సోమవారం ఆయన పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో సంప్రదింపులు జరిపి గోదావరి కాల్వకు నీటిని వదిలేందుకు కృషి చేశామన్నారు. త్వరలో స్టోరేజ్ ట్యాంకును నింపుతామన్నారు.

నేటి నుంచి 27 వరకు మద్యం షాపులు బంద్

పోలవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) :పోలవరం మండలంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకూ మద్యం షాపులు బంద్ చేయనున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో పట్టిసీమలో మహా శివరాత్రి ఉత్సవాలు, ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో పోలవరం, గూటాల, ఎల్.ఎం.డీపేట గ్రామాల్లో ఉన్న మద్యం షాపులను బంద్ చేయిస్తున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

మార్చి 9న కళారంగ 60వ వసంతోత్సవం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):అభినయ నృత్యభారతి, ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమ సంఘం వివిధ సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో కళారంగ 60వ వసంతోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఏలూరు వైఎంహెచ్ఏ హాలు ప్రాంగణంలో సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దువ్వి రామారావు కళారంగ ప్రవేశం చేసి 60 వసంతాలైన సందర్భంగా మార్చి 9న ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు దువ్వి హేమ సుందర్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ వెంకట్ సారథ్యంలో నృత్య నాటికను ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కళాభిమానులు విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు ప్రారంభం

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఎల్‌డీఎం డి.నీలాద్రి తెలిపారు. సోమవారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు 28వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా బ్యాంకు కార్యకలాపాలను ప్రజలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. ఆర్థిక నిర్ణయాలు, ఉత్పత్తులు, సేవల గురించి అవగాహన కల్పించ నున్నట్టు తెలిపారు. మహిళల ఆర్థిక ప్రగతే ఈ ప్రచారం ఉద్దేశమన్నారు. గృహిణులు, శ్రామిక మహిళలు, మహిళా వ్యవస్థాపకులపై ప్రత్యేక దృష్టి పెడుతుందన్నారు.

పంటలకు సక్రమంగా సాగునీరందిస్తాం

లింగపాలెం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : పంట కాలువల ద్వారా సక్రమంగా సాగునీరందించేలా చర్యలు చేపట్టినట్టు సాగునీటి సంఘం అధ్యక్షుడు మొరంపూడి ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ధర్మాజీగూడెంలోని పాల వాగు ఛానల్ పూడిక తొలగింపు పనులను పరిశీలించారు. రైతులు నష్టపోకూడదనే ఆలోచనతో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సహకారంతో ఈ పనులను చేపడుతున్నామని అన్నారు.

కార్మికులకు నగర పాలక సంస్థే జీతాలు చెల్లించాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి సంస్థ నుంచే జీతాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్య దర్శి శ్రీనివాసరావు, అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇరువురు మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేయాలనే ఆలోచన విరమించుకోవాలన్నారు. 12వ పీఆర్‌సీని తక్షణమే ప్రకటించాలన్నారు. పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గోకుల పారిజాత గిరిలో షాపులకు టెండర్లు

ఏలూరు,ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాత గిరి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని షాపులకు టెండర్లు పిలిచారు. ఏడాది పాటు పాలు, కూరగాయలు, కిరాణా సరుకులు, స్వామికి పూల దండలు సరఫరా చేసేందుకు ఆలయం వద్ద దేవదాయ శాఖ తనిఖీదారు వి.సురేష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రొవిజనల్ టెండర్లు స్వీకరించారు. కిరాణా సరుకులకు పట్టణానికి చెందిన విజయ జనరల్ స్టోర్స్ దక్కించుకోగా పూల దండలు సరఫరా చేసేందుకు పట్టణానికి చెందిన అంబికా ఫ్లవర్ స్టాల్స్ వారు దక్కించుకున్నారని, పాలు, పెరుగు కూరగాయలు సరఫరా చేసేందుకు శ్రీచక్ర ఏజెన్సీ వారు దక్కించుకున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు.

దేవదాయ శాఖ పరిధిలో కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం

ఏలూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెంలోని పంచాయతీ రాజ్ కార్యాలయ ఆవరణలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్వాధీనం చేసుకున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉన్న హుండీలకు సీళ్ళు వేసినట్లు ఏలూరు దేవదాయ శాఖ తనిఖీ అధికారి వి.సురేష్ తెలిపారు.గత కొంత కాలంగా పంచాయతీ రాజ్ కార్యాలయ అధికారులకు పలువురు వ్యక్తులకు ఈ ఆలయం తమదంటే తమదని ఇరు వర్గాలకు వివాదాలు జరిగిన నేపథ్యంలో దేవదాయ శాఖ ఈ ఆలయాన్ని స్వాధీనం చేసుకోవడం చర్చనీయాంశమైంది.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు

టి.నరసాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):మహాశివరాత్రికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులకు ఎస్సై ఎం.జయబాబు సూచించారు. స్థానిక శ్రీఅన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దివ్యక్షేత్ర ప్రాంగణంలోని అన్నదాన భవనంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్ రాజు అధ్యక్షతన కమిటీ సభ్యులకు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై జయబాబు మాట్లాడుతూ మహా శివరాత్రికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ బాధ్యతలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్సై జయకుమార్, పసుమర్తి రాము, పర్వతనేని మురళీ, లింగారెడ్డి శ్రీనివాస్, మణికంఠ, వెజ్జురాజు, కొప్పాల బద్రి, చేబోలు తాతారావు, పర్వతనేని ప్రశాంత్, రవి, నాగరాజులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

చింతలపూడి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కార్మిక సంఘం పట్టణాధ్యక్షులు జూపూడి వసంత డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సి.హెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి 42 వేల పెండింగ్ క్లెయిమ్స్‌ను తక్షణం పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నాలో కార్మిక సంఘం పట్టణాధ్యక్షులు జూపూడి వసంత, ఎస్.కె.సుబాని, కృష్ణా ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు హరిబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

చేనేత రంగానికి నిధులు కేటాయించాలి

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో చేనేత రంగానికి రెండు వేల కోట్లు కేటాయించాలని కోరుతూ ఏపీ చేనేత కార్మిక సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నాయకులు చేనేత, జౌళిశాఖ ఏడీకి వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర పిలుపులో భాగంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చేనేత కార్మిక సంఘం కార్యదర్శి కడుపు కన్నయ్య, జిల్లా నాయకులు యర్రా వెంకటేశ్వర్లు ఏడికి వినతిపత్రాన్ని అందజేశారు.

రేషనలైజేషన్‌లో ఇబ్బందులు లేకుండా చూడండి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న సచివాలయాల రేషనలైజేషన్‌లో వీఆర్వోలకు భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సరైన నిర్ణయాలు తీసుకోవాలని, సోమవారం మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను రాష్ట్ర వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఖాళీగా ఉన్న సీనియర్, జూనియర్, అసిస్టెంట్ పోస్టులు, రెవెన్యూకు అనుబంధంగా ఉన్న స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సివిల్ సప్లైయిస్, ఇతరశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అర్హులైన గ్రేడ్ -1, గ్రేడ్ -2 వీఆర్వోలకు అవకాశం కల్పించాలని కోరారు. రేషనలైజేషన్‌లో మార్పులు చేసేటప్పుడు వీఆర్వో అధికారుల సంఘంతో చర్చించాలని విజ్ఞప్తి చేశారు.

వర్గీకరణపై పునరాలోచన చేయాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : సున్నితమైన వర్గీకరణ సమస్యను టీడీపీ కూటమి ప్రభుత్వం జఠిలం చేస్తోందని రాజ్యసభ సభ్యుడు గొల్లా బాబూరావు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో అన్నదమ్ముల్లా ఉన్న ఎస్సీల్లోని రెండు సామాజిక వర్గాల మధ్య విబేధాలు సృష్టించవద్దని కోరారు. ఎవరికి అన్యాయం జరగకుండా న్యాయమైన విధంగా ప్రభుత్వం ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రామచంద్రాపురం శ్మశాన వాటిక వద్ద ఉద్రిక్తత

ఏలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణంలోని రామచంద్రాపురం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను సోమవారం పలువురు స్థానికులు అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తాము నివాసం ఉండే ఇక్కడి నుంచి శ్మశాన వాటికను తరలించాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్డీవో ఎం.వి.రమణ, తహసీల్దార్ స్లీవజోజి, కమిషనర్ కె.వి.రమణ, సీఐ కృష్ణబాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు.శ్మశాన వాటిక పై ఉన్నతాధికారుల ఆదేశాలిచ్చే వరకు ఎటువంటి వివాదాలు లేకుండా ఉండాలని ఆర్డీవో సూచించారు. ఇదిలా ఉండగా శ్మశాన వాటికను అక్కడి నుంచి తరలించాలని ఆర్డీవో కార్యాలయంలో సీఐటీయూ ఫిర్యాదు చేసింది.

సర్వం సిద్ధం

శివరాత్రి ఉత్సావాలకు ఏర్పాట్లు పూర్తి - భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు


సమావేశమైన గ్రామ కమిటీ


పట్టిసీమలో చేసిన ఏర్పాట్లు

పట్టిసీమలో అడుగడుగునా పటిష్ఠ భద్రత...

ఏలూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమలో మహాశివరాత్రి ఉత్సవాలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఫెర్రీ రేవు నుంచి గోదారిపై పంట్లతో నడకదారి సోమవారం నాటికి సిద్ధం చేశారు. ఇసుక తిన్నెల్లో నడక ప్రయాస లేకుండా గోదావరి తీరం నుంచి ఆలయ సింహద్వారం వరకూ ఐదు వరుసల గోనె సంచులతో కాలిబాట ఏర్పాటు చేశారు. నదిలో వెదురు కర్రలతో భారికేడింగులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహించేందుకు పడవలు ఏర్పాటు చేశారు. స్నానాల రేవుల వద్ద స్నానాల గదులు, ఇసుక తిన్నెల్లో అన్నదాన సత్రాల వద్ద చేతి పంపులు ఏర్పాటు చేశారు. భక్తులు సేద తీరేందుకు దారి పొడవునా చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా నదీ తీరం వెంబడి పోలీసులు పర్యవేక్షించేందుకు 8 వాచ్ టవర్లు ఏర్పాటు చేశారు. ఫెర్రీ టికెట్ కౌంటర్లు, ఆలయ ప్రాంగణంలో టికెట్ కౌంటర్ల వద్ద క్యూలైన్ బారికేడ్లు, కాలినడక ప్రాంతంలో కూలైన్లు ఏర్పాటు చేశారు. ఫెర్రీ వద్ద వివిధ శాఖల అధికారుల కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణం నుంచి ఫెర్రీ రేవు, నదిపై కాలి నడక బాట, ఫెర్రీ టికెట్ కౌంటర్ల వరకు, ఏటిగట్టు నుంచి కన్నాపురం అడ్డరోడ్డు వరకు ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి.

రాట్నాలమ్మ తిరునాళ్లపై సమీక్ష

పెదవేగి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : మరో రెండు నెలల్లో జరుగనున్న శ్రీరాట్నాలమ్మ తిరునాళ్ళ ఏర్పాట్లపై గ్రామస్థులు సోమవారం సమావేశమై సమీక్షించారు. అమ్మవారి తిరునాళ్ల ప్రతి ఏటా చైత్రశుద్ధ పౌర్ణమి నుంచి ప్రారంభించి తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నారు.ఏప్రిల్ 19వ తేదీ నుంచి తిరునాళ్ల ప్రారంభమవుతాయని, ఈ తిరునాళ్ల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై గ్రామస్థులు చర్చించారు. ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్, పాలకవర్గం మాజీ చైర్మన్ రాయల ఉమామహేశ్వరరావు, విజయరాయి సొసైటీ మాజీ చైర్మన్ బొప్పన సుధాకర్, రాట్నాలకుంట, రాయన్నపాలెం, కొండలరావుపాలెం నాయకులు మంచినేని శ్రీనివాసరావు, బొద్దు సురేష్, నరేంద్ర, ఎం.శ్రీనివాసరావు, పి.నాగభూషణం పాల్గొన్నారు.


పట్టిసీమ ఆలయంలో ప్రత్యేక పూజల దృశ్యం

పేరాబత్తులను గెలిపించండి

ఓటర్లను అభ్యర్థించిన కూటమి నాయకులు

కామవరపుకోట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణలు పేర్కొన్నారు. సోమవారం పలు గ్రామాల్లో పట్టభద్రులను ఇంటింటికి వెళ్ళి కలుసుకుని నమూనా బ్యాలెట్‌లు అందచేసి 27న జరిగే ఎన్నికల్లో పేరాబత్తులకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట చింతలపూడి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు జుజ్జూరి బాబ్జి, ఆడమిల్లి సర్పంచ్ గూడపాటి కేశవరావు, తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారధిబాబు, గుంటుపల్లి సర్పంచ్ గోరింక దాను, ఎంపిటిసి కంఠమనేని పుష్పరాజ్యం, కూటమి నాయకులు బాలవర్ధిరాజు, షేక్ వలీ, బేతిన వెంకట్రావు, కంఠమనేని అంజిమూర్తి ఉన్నారు.

ఏలూరు : కూటమి బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలిపించాలని జంగారెడ్డిగూడెం టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ కోరారు. సోమవారం నాయకులు జంగారెడ్డిగూడెంలో సీనియర్ సిటీజన్స్‌తో కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామకుమార్, నంబూరి రామచంద్రరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చింతమనేని

బుట్టాయగూడెం : పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జీ, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. సోమవారం బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో బూత్ ఇన్‌చార్జీలు, ఏజెంట్లు, పీఏసీలు, కూటమి మండల నాయకులతో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ పరిశీలకుడు పుచ్చ విజయకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఓటరు వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు అనపర్తి వెంకట నారాయణ, నాయకులు పారేపల్లి రామారావు, శీలం వెంకటేశ్వరరావు, మొగపర్తి సోంబాబు, కొండేపాటి రామకృష్ణ, వంకా కాంచనమాల, మెట్టు బుచ్చిబాబు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం విజయం కోరుతూ కూటమి నాయకులు ప్రచారం చేశారు. ఈ మేరకు మండలంలోని వివిధ పాఠశాలలకు వెళ్లి కూటమి అభ్యర్థికి ఓటు వేయాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. కూటమి అభ్యర్థి గెలుపొందితే నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

ఏలూరు టూటౌన్ : ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల కాలంలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమాలు అమలు చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ 6 పథకాలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదవేగి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా వృధా కాకుండా ఓటర్లలో మరింతగా అవగాహన కల్పించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి నాయకులు ఓటర్లకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి 30మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జ్‌ని నియమించామని, ఇప్పటికే వారంతా ఓటర్లకు చాలా వరకు అవగాహన కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిశోర్, కూటమి నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్ ప్రసాద్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు

ఉంగుటూరు/లింగపాలెం/దెందులూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు హైస్కూల్లో జరుగుతున్న అంగన్వాడీల జ్ఞానజ్యోతి శిక్షణలో భాగంగా సోమవారం చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు తోట మీనా కుమారి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి పరసా వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని భవిష్యత్తులో ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను చిన్నారుల బోధనలో మెళకువలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్లుగా అల్లు శ్రీను, శివకుమార్, బి.వి.శ్రీలక్ష్మి, డి.శారదామణి, సీ.ఆర్పీలు విష్ణు, నారాయణ, అంగన్వాడీలు పాల్గొన్నారు. దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తల శిక్షణ తరగతులను విద్యాశాఖ అధికారి అన్నమ్మ పరిశీలించారు. ఈ శిక్షణ తరగతుల్లో అంగన్వాడీ సెక్టార్ సూపర్ వైజర్లు చిట్టెమ్మ, శ్రీదేవి, పద్మభూషణం, రిసోర్స్ పర్సన్స్ పాండు రంగారావు, జయపాల్ పాల్గొన్నారు. లింగపాలెం మండలంలో సింగగూడెం హైస్కూల్లో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పంకజ్ కుమార్ పరిశీలించారు. శిక్షణలో జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో జె.రవీంద్ర, బి.శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి పాల్గొన్నారు.


త్రోబాల్ విజేత జట్లతో కొప్పాక హైస్కూల్ హెచ్ఎం శైలజ, పీడీ శ్రీనివాసరావు

రెండు విభాగాల్లో ప్రథమ స్థానం

పెదవేగి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : కొవ్వలిలో ఈనెల 21, 22 తేదీల్లో జరిగిన గ్రిగ్స్ ఆటల పోటీల్లో కొప్పాకలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండు విభాగాల్లో పతకాలను సాధించారు. త్రోబాల్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు బాల మణికంఠ, తరుణ్ శ్రీరామ్, వెంకట్, ధనుష్, అఖిలేష్, మనోజ్, శ్యామ్‌కుమార్, జశ్వంత్, హర్ష, భువనేశ్వరి, గౌరీదేవి, నాగదీప్తి, గీత, ప్రియ, నేహా, మహాలక్ష్మి, ప్రీతి, ఎస్తేరు రాణిలకు అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరాశరం భాస్కర దీక్షితులు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్.శైలజ, పీడీ ఎం.శ్రీనివాసరావు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

ముగిసిన గంగానమ్మ జాతర

భారీగా తరలివచ్చిన జనసందోహం

పెదవేగి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : గంగానమ్మ తల్లి జాతర ముగింపును పురస్కరించుకుని కూచింపూడి గ్రామం సోమవారం జనసందోహంతో కిటకిటలాడింది. అడుగడుగునా ట్రాఫిక్ జామ్‌లతో జనం ముందుకు సాగడానికి అవస్థలు పడ్డారు. జాతర కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే ప్రమాదాన్ని ముందుగానే ఊహించిన పోలీసులు వాహనాలను గ్రామంలోపలికి వెళ్లకుండా ఊరిబయట పార్కింగ్‌లు ఏర్పాటు చేయించారు. భారీసంఖ్యలో తరలివచ్చిన ప్రజానీకంతో గ్రామం జనంతో కిక్కిరిసిపోయింది. గ్రామస్థులు దూరప్రాంతాల్లో ఉన్న బంధువులను సైతం ఆహ్వానించి, చీర, సారె, పసుపు, కుంకుమలు అందించి పంపించారు.


కైకరంలో మహర్షి ఊరేగింపు

ఉంగుటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైకరం గ్రామంలో ఉన్న శ్రీచిద్వేంకట రామబ్రహ్మానంద మహర్షి నిలయంలో స్వామి వారి ఊరేగింపు సోమవారం ఉత్సాహంగా జరిగింది. తీన్‌మార్ డప్పులతో ట్రాక్టర్‌పై స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హిందూ దేవుళ్లను కించపర్చిన హెచ్ఎంపై చర్యలు తీసుకోండి

లక్కవరంలో పాఠశాల వద్ద తల్లిదండ్రుల ధర్నా

ఏలూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలోని రెడ్డిపేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎంకు వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. హిందూ దేవుళ్లను కించపర్చడమే కాకుండా తమ పిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించిన హెచ్‌పై ఫిర్యాదు చేసి పది రోజులు దాటినా హెచ్ఎంపై ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడమే కాకుండా లక్కవరం జడ్పీ హైస్కూల్లో సోషల్ సబ్జెక్ట్ బోధించడానికి విద్యాశాఖ అధికారులు సుబ్రహ్మణ్యంను నియమించడం పట్ల లక్కవరం హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్కవరం హైస్కూల్లో హెచ్ఎం పని చేయడానికి వీల్లేదని, ఆయన్ని సస్పెండ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. హెచ్ఎంపై చర్యలు తీసుకునే వరకు తమ పిల్లలను పాఠశాలకు పంపించబోమని తెలిపారు. ధర్నా అనంతరం విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేసి తనకు పంపించాలని కలెక్టరు వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్ఎంను తిరిగి అదే గ్రామంలో హైస్కూల్‌కు పంపడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంఈఓలు బి.రాముడు, జి.రాములు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. ఈ రిపోర్టును జిల్లా విద్యాశాఖాధికారి ద్వారా కలెక్టరుకు పంపుతామని అధికారులు తెలిపారు.


తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేస్తున్న చిన్నారులు

'నిరుద్యోగ యువతను ఆదుకుంటాం'

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ కుమారుడు శ్రీరాజ్ కోరారు. హర్షకుమార్ చిన్న కుమారుడు సుందర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఈ మేరకు సుందర్‌ను గెలిపించాలని కోరుతూ శ్రీరాజ్ ద్వారకాతిరుమలలో ప్రచారం చేశారు. ముందుగా ఆయన స్వామి, అమ్మ వార్లను దర్శించి పూజలు నిర్వహించారు. ఈ ప్రచారంలో ఎంపిటీసి బిరుదుగడ్డ బజారయ్య, మానుకొండ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థుల కోసం ప్రచారం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి కె.ఎస్.లక్ష్మణరావును, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి దిడ్ల వీరరాఘవులు పోటీ చేస్తున్న ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థులను గెలిపించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. సోమవారం స్థానిక అన్నేభవనంలో జరిగిన రైతు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారి విజయం కోసం పట్టభద్రులు సహకరించాలని కోరారు. మూడు నియోజకవర్గాల్లో రైతు కుటుంబాలకు సంబంధించిన ఉపాధ్యాయులు, నిరుద్యోగ పట్టభద్రులను పీడీఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేలా అన్ని ప్రాంతాల్లో ఉన్న రైతు సంఘం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు తదితరులు ఉన్నారు.


నాగాభరణం అందజేస్తున్న బొరగం శ్రీనివాసులు

నాగాభరణం బహూకరణ

ఏలూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు దిగువ కాపర్ డ్యాం సమీపంలో గోదావరి నది మధ్యలో చిత్రకూట పర్వతంపై వెలసిన మహానందీశ్వర స్వామి ఆలయానికి ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు సోమవారం వెండి నాగాభరణం బహూకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన మహానందీశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి, ప్రాజెక్టు ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయానికి ఒకటిన్నర కిలోల వెండితో నాగాభరణం బహూకరించినట్లు తెలిపారు. ఈ నాగాభరణాన్ని ఆలయ నిర్వహకులు కోటంరాజు రాంబాబు, అర్చకులు రాంబాబులకు అందజేశారు.

ఇంటర్వ్యూ..

నేరాల నివారణకు ప్రజలు సహకరించాలి

ఎం.సూర్య భగవాన్, ఎస్.ఐ., చేబ్రోలు



● స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పరిస్థితి ఏమిటి?

జవాబు : లా అండ్ ఆర్డర్ అదుపులో ఉంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రధాన కూడళ్లలో ముఖ్యంగా నారాయణపురం సెంటర్‌లో నిత్యం కానిస్టేబుళ్లు, హోం గార్డులను ఏర్పాటు చేస్తున్నాం.

● నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలేమిటి?

జవాబు : ప్రజల సహకారంతో నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ప్రధాన వ్యాపార కూడళ్లలో వ్యాపార సముదాయాల వద్ద సి.సి. కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. అలాగే హైవేపై ఏమైనా ప్రమాదాలు జరిగితే అంబులెన్స్‌తో పాటు 108 ద్వారా క్షతగాత్రులను తక్షణం వైద్యం నిమిత్తం తాడేపల్లిగూడెం, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రులకు తరలిస్తున్నాం.

● సిబ్బంది పని తీరు ఎలా ఉంది?

జవాబు : హైవే, ఏలూరు కెనాల్, రైల్వే ట్రాక్‌ల కారణంగా నిత్యం ఏదో సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ విషయంలో ఉన్నతాధికారుల సూచనలతో సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం.

● వాహన తనిఖీలు జరుగుతున్నాయా?

జవాబు : నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాం. డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు ఉంగుటూరు టోల్‌గేటు వద్ద బాదంపూడి వై.జంక్షన్ వద్ద వాహనాల రాకపోకలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

● చోరీల నియంత్రణకు తీసుకున్న చర్యలేమిటి?

జవాబు : రాత్రి సమయాల్లో సిబ్బందితో పాటు తాను నిడమర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష జరిపి చోరీల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం.

- ఉంగుటూరు,(ఆంధ్రజ్యోతి)

సామూహిక వ్రతాలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : మాఘమాసంలో బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం స్థానిక రామకోటి ప్రాంగణంలో రామకోటి ఉత్సవాల్లో భాగంగా భక్తులతో సామూహికంగా శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలను జరిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గూటాలలో ఆలయం ప్రారంభం

ఏలూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం గూటాల లక్ష్మీ నరసింహ స్వామి నూతన ఆలయాన్ని కాకినాడ దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేశ్ బాబు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గూటాల టీడీపీ నాయకులు మాజీ మండలాధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, ఏనుగుల శ్రీనివాస్, జల్లేపల్లి రామకృష్ణ, సింహాద్రి ప్రసాద్, కృష్ణమూర్తి, మహంతి వెంకటేశ్వరరావు, ఒబిలిశెట్టి ప్రసాద్, గంధం రాజు, తదితరులు పాల్గొన్నారు.

కిష్టారంలో సారా పట్టివేత

కుక్కునూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో ఎక్సైజ్ సిబ్బంది సోమవారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో నాలుగు లీటర్ల సారాతో ఉన్న ఓ వ్యక్తిని పట్టుకున్నారు.అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కే.శ్రీనివాస్ తెలిపారు. మండలంలో సారా స్థావరాలపై విస్తృతంగా దాడులు చేస్తున్నామని, ఎవరైనా సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ దాడుల్లో ఎస్సై జీ.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీలకు అప్పగించొద్దు

చింతలపూడి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల జీతభత్యాల బాధ్యతను కాంట్రాక్టు ఏజెన్సీలకు అప్పగించొద్దని ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతూ ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వి.సత్యనారాయణ, టి.బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆప్కాస్ విధానం ద్వారా మునిసిపల్ కార్మికులకు జీతాలు అందేవన్నారు. కాంట్రాక్టు ఏజెన్సీలకు అప్పగిస్తే రెండు, మూడు నెలలకు కూడా రావడంలేదని ఆరోపించారు. ఇదే విషయమై అనంతరం మునిసిపల్ కమిషనర్ డి.పావనికి వినతిపత్రం అందజేశారు. కార్మిక సంఘ నాయకులు కంచర్ల గురవయ్య, వెలగాడి అనురాధ, పద్మ, బాలు, చిన్నయ్య, నాగమణి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ధ్వజారోహణం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో వేదపారాయణలు, స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనను నిర్వహించారు. రాత్రి ఆలయంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యహవాచన, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం జరిగాయి. అలాగే హోమగుండంలో అగ్నిప్రతిష్టాపన, మండపార్చన, ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శివయ్య బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు సర్వాదిదేవతా గణాలను ఆహ్వానించే క్రమంలో నంది పటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ జరిపారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
నూజివీడు, కైకలూరు
7 www.andhrajyothy.com ● మంగళవారం 25 ఫిబ్రవరి 2025

విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వర్క్‌షాపుల ద్వారా విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని హైదరాబాద్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.గురు విద్యార్థి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఎంఎంఈ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ఎంఎంఈ విభాగంలో నూతన ఆవిష్కరణలపై మోహన మురళీకృష్ణ, అకడమిక్ డీన్ ఎస్.చిరంజీవులు వివరించారు.

సబ్ జోన్ పోటీల్లో మర్లపాలెం విద్యార్థుల ప్రతిభ

చాట్రాయి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి హైస్కూల్లో ఇటీవల జరిగిన నూజివీడు సబ్ జోన్ ఆటల పోటీల్లో మర్లపాలెం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను చూపి విజేతలుగా నిలిచారు. త్రోబాల్ విభాగంలో బాలికల జట్టు ప్రథమ స్థానం, బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించారు. విజేతలైన క్రీడాకారులను హెచ్ఎం బక్కయ్య, స్టాఫ్ సెక్రెటరీ రఘు, పీడీ సతీష్‌కుమార్ ఉపాధ్యాయులు అభినందించారు.



బలివే తమ్మిలేరుపై నిర్మించిన బ్రిడ్జి

బ్రిడ్జి నిర్మాణంతో తీరిన కష్టాలు

» ఆరు నెలల్లోనే నిర్మాణాన్ని పూర్తి చేసిన కూటమి ప్రభుత్వం

» హర్షం వ్యక్తం చేస్తున్న బలివే, విజయరాయి ప్రజలు

ముసునూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బలివే నుంచి విజయరాయి వెళ్లేందుకు తమ్మిలేరుపై బ్రిడ్జి నిర్మించడంతో ప్రజల కష్టాలు తీరాయి. 2014-19 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.16 కోట్లు కేటాయించింది. భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యి, బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యే సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బ్రిడ్జి నిర్మాణం పట్ల నిర్లక్ష్యం వహించారు. 2024 ఎన్నికల ముందు హడావుడిగా పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ బ్రిడ్జి పనులను వేగవంతం చేసి, ఆరు నెలల్లో పూర్తిచేసింది. రెండు వైపులా అప్రోచ్ రహదారులను వేశారు. ప్రస్తుతం బ్రిడ్జి వినియోగంలోకి రావడంతో తమ కష్టాలు తీరాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు పడ్డాం

బలివే నుంచి విజయరాయి వెళ్లేందుకు బ్రిడ్జి లేక ఇబ్బందులు పడ్డాం. వర్షకాలం వచ్చిందంటే తమ్మిలేరులో తాత్కాలిక రహదారి కొట్టుకుపోయి నెలల తరబడి రాకపోకలు నిలిచిపోయేవి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయడం ఆనందంగా ఉంది.

- పామర్తి చిన్నవేణు, బలివే

ప్రజల కష్టాలు తీరాయి

గతంలో టీడీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే, అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల క్రితం పూర్తికావాల్సిన బ్రిడ్జి నిర్మాణం ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చి ప్రజల కష్టాలను తీర్చింది.

- తుమ్మల నాగేశ్వరరావు, వేల్పుచర్ల




యాగశాలలో సాలగ్రామాలకు అభిషేకాలు.. కలశారాధనకు సిద్ధంగా కలశాలు

లక్ష్మీ నారసింహుడికి అభిషేకాలు

రేపు సుదర్శన నృసింహ మహాయజ్ఞం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై కొలువుదీరిన లక్ష్మీనారసింహుని సన్నిధిలో జరగనున్న అతిరుద్ర ప్రయోగ సహిత సుదర్శన నృశింహ మహాయజ్ఞం సందర్భంగా సోమవారం ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఈక్రమంలో ఉదయం ఆలయ యాగశాలలో మండపారాధన, నిత్యహోమం నిర్వహించారు. అంతకు ముందు మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు జరిగాయి. అనంతరం సాలగ్రామ అభిషేకాలు, ఆ తరువాత ఉపనిషత్ పూర్వక లక్ష్మీగణపతి మూల మంత్ర సహిత అష్టద్రవ్య హోమాన్ని పండితులు, రుత్వికులు నిర్వహించారు. ఈయజ్ఞ నిర్వాహకులు కొచ్చర్లకోట నరసింహగురూజీ ఆలయ యాగశాలలో ఈ యజ్ఞక్రతువుకు శ్రీకారం చుట్టారు. అనంతరం రుద్రహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినమైన ఈ నెల 26 సాయంత్రం నుంచి తెల్లవార్లూ ఈ 31వ అతిరుద్రప్రయోగ సహిత సుదర్శన నృశింహమహాయజ్ఞం అట్టహాసంగా జరుగుతుందని భక్తులు తరలిరావాలని నిర్వాహకులు నరసింహగురూజీ, సివి కుటుంబరావు కోరారు.

విద్యార్థులు డబ్బులిచ్చి మోసపోవద్దు : డీఈవో

‘ఓపెన్’ ఇంటర్ పరీక్షాకేంద్రాల సీఎస్‌లు, డీవోలతో సమావేశం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మార్చి 3వ తేదీ నుంచి 15 వరకు జరుగనున్న ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఏలూరు జిల్లా డీఈవో వెంకట లక్ష్మమ్మ ఆదేశించారు. జిల్లాలో ఓపెన్ స్కూల్స్ ఇంటర్ పరీక్షలు జరిగే కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సోమవారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు(అభ్యాసకులు) ఎవరిమాటలను నమ్మి మోసపోవద్దని, డబ్బులు ఇవ్వొద్దని విస్పష్టంగా తెలియజేయాలని కోరారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.శ్రీకాంత్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఏవైనా తేడాలొస్తే బాధ్యులను కాపాడేవారెవరూ ఉండరని, ఎవరిపైనా జాలిపడాల్సిన అవసరంలేదని హెచ్చరించారు. పరీక్షలు జరిగేటపుడు విద్యాశాఖ నియమించిన స్క్వాడ్ బృందాలతోపాటు, ఇతరశాఖల అధికారులు, తహసీల్దార్లు కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తారని వివరించారు. డీఈవో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలపై డైలమా !

ఓపెన్ స్కూల్స్ ఇంటర్ పరీక్షలపై డైలమా నెలకొంది. గతేడాది డిసెంబరు వరకు తత్కాల్ స్కీంపై అడ్మిషన్లు తీసుకున్న నేపథ్యంలో ఇంత వరకు సిలబస్ పూర్తికాలేదని, అడ్మిషన్ ఫీజులు చెల్లించిన అభ్యాసకులకు స్టడీ మెటీరియల్‌ను కూడా అందజేయకుండా వార్షిక పరీక్షలు నిర్వహించడం అభ్యంతరకరమంటూ రాష్ట్రంలోని పలు ఓపెన్‌స్కూల్స్ స్టడీసెంటర్ల(ఏఐ) కో-ఆర్డినేటర్లు న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తొలుత సింగిల్ జడ్జి కోర్టును ఆశ్రయించగా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనికనుగుణంగానే మార్చి 3నుంచి రెగ్యులర్ ఇంటర్మీడియట్ విద్యార్థులతోపాటే ఓపెన్‌స్కూల్స్ ఇంటర్ అభ్యాసకులకు కూడా పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాల పంపిణీ, సిబ్బంది నియామకాలు కూడా జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ పలువురు ఏఐ కో-ఆర్డినేటర్లు హైకోర్టు ధర్మాసనాన్ని ఆశ్రయించారు. సోమవారం కోర్టులో వాదనలు జరుగుతున్నందున పరీక్షల నిర్వహణపై కోర్టు నిర్ణయం ఎలా ఉంటుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.



బీజేపీ నూజివీడు పట్టణ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు

బీజేపీ పట్టణ నూతన కార్యవర్గం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ నూజివీడు పట్టణ కమిటీ ఎన్నికను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా రెడ్డి మురళీమోహన్‌రావు, రాయపాటి లీలా, విజయ్‌జ్యోతి, పుచ్చకాయల లాలయ్య, షేక్ ఆలీషా, అంబటి మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా దేసపాటి మల్లిఖార్జున జగదీష్, దద్దనాల రవికిషోర్, కార్యదర్శులుగా వి.బాలు, పులపాక విజయలక్ష్మీ, మాగంటి వాణి, ప్రతాప్, సూర్యప్రకాష్, కోశాధికారిగా పరిమి శ్రీనివాస కుమార్ తదితరులు ఎన్నిక అయ్యారు.



ముదినేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని



చాట్రాయిలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి



కలిదిండిలో కూటమి నేతల ఎన్నికల ప్రచారం

రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించడమే లక్ష్యం

» మంత్రి కొలుసు పార్థసారథి

చాట్రాయి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడానికి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. చాట్రాయిలో సోమవారం గ్రాడ్యుయేట్ ఓటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రభుత్వాన్ని ఇంకా బలోపేతం చెయ్యాలని, కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గింజుపల్లి రమేశ్, మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, అత్తులూరి శ్రీనివాసరావు, మరిడి చిట్టిబాబు, పలగాని దుర్గారావు, బొట్టు లక్ష్మణరావు, నోబుల్‌రెడ్డి, కలకొండ భాస్కరరావు, నక్కా రాము, తల్లాడ శ్రీను పాల్గొన్నారు.

ముదినేపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు ప్రతిష్టాత్మకమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహ రావు అధ్యక్షతన ముదినేపల్లిలో సమావేశం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, ఎన్నికల వలంటీర్లకు ఎమ్మెల్యే కామినేని దిశానిర్దేశం చేశారు. మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్ రావు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, మెంటే పార్థసారథి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

● నూజివీడు: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ ఆధ్వర్యంలో రావిచర్ల గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఎస్.సునీల్ కుమార్, కిషోర్, తోట అంజిబాబు, విల్సన్, బెజవాడ దుర్గారావు, మరీదు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● కైకలూరు (ముదినేపల్లి): కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని ఏపీ ఆర్యవైశ్య సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పీజీఎస్ మాల్యాద్రి కోరారు. కైకలూరు పట్టణంలో టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు, వీరాబత్తిన సుధ, అద్దెపల్లి బ్రహ్మాజీ, వేములపల్లి కారుణ్య, కర్రి శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● ముదినేపల్లి: ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ జనసేన ఆధ్వర్యంలో దేవపూడి, వణుదుర్రు, ప్రొద్దువాక గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దాసరి రమేష్, సర్పంచ్ కాశీ అన్నపూర్ణ తదితరులు పర్యటించారు.

● కలిదిండి: గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల కూటమి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ కలిదిండిలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, చిట్టూరి రవీంద్ర, అంకాల దుర్గా ప్రసాద్, కోకా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు



దేవపూడిలో జనసేన నాయకుల ప్రచారం



గంగానమ్మ అమ్మవారికి పూజలు

బలివే ఉత్సవాలు ప్రారంభం

ముసునూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి గ్రామదేవత గంగానమ్మకు 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ప్రధానార్చకులు తోలేటి అరుణ భాస్కరరావు వేదమంత్రోచ్చరణ బలిహరణ, హోమం, స్వామివారి ధ్వజారోహరణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం బిందె తీర్థం, హోమం, బలిహరణాదులు, ప్రసాద స్వీకరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమాల్లో ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య పాల్గొన్నారు.



అక్షరను అభినందిస్తున్న హెచ్ఎం, టీచర్లు

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ముదినేపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో జరిగిన పాఠశాల విద్యార్థుల సబ్ జోన్ ఆటల పోటీల్లో లాంగ్ జంప్ విభాగంలో వడాలి హైస్కూలు విద్యార్థిని దాసు అక్షర బంగారు పతకం సాధించింది. సోమవారం అక్షరకు మెడల్, ప్రశంసాపత్రం అందజేసి హెచ్ఎం ప్రభుదాను, ఉపాధ్యాయులు అభినందించారు.

● ముసునూరు: నూజివీడు సబ్ జోన్ ఆటల పోటీల్లో ముసునూరు విద్యార్థులు త్రోబాల్‌లో రన్నర్స్‌గా నిలిచారు. సోమవారం విద్యార్థులను ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎం.వాణి, వ్యాయామ ఉపాధ్యాయులు హేమాదేవి, ఆలీఖాన్‌లు అభినందించారు.



కాలువలో బోల్తా పడిన డంపర్

కాలువలో బోల్తా కొట్టిన డంపర్

చాట్రాయి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట- చింతలపూడి రహదారిలో మంకొల్లు వద్ద సోమవారం సాయంత్రం డంపర్ అదుపు తప్పి కాలువలో బోల్తా కొట్టింది. ప్రమాదం నుంచి డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డారు. అన్‌లోడ్ చేసి వస్తున్న డంపర్ పశువులను తప్పించబోయి బోల్తా పడింది. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు, ఇబ్రహీంపట్నం నుంచి చాట్రాయి మీదుగా 50, 60 టన్నుల భారీ డంపర్లతో జంగారెడ్డిగూడెం ప్రాంతంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకి మెటల్ తరలిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డంపర్ల రాకపోకలను నియంత్రించాలని, అతివేగానికి కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ, ఎస్ఐ

సైబర్ నేరస్తులతో జాగ్రత్త

విద్యార్థులకు అవగాహన సదస్సు

కైకలూరు(ముదినేపల్లి), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. కైకలూరు పట్టణ పోలీసులు సోమవారం ప్రభుత్వ హైస్కూల్‌లో మహిళలు, బాలికలు, అభయ మహిళా రక్షక దళ సభ్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సీఐ కృష్ణ, పట్టణ ఎస్సై వెంకట కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, బాలికలకు స్వీయరక్షణ, నకిలీ రుణయాప్‌ల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.



ఫార్మర్ రిజిస్ట్రీ విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఫార్మర్ రిజిస్ట్రీతోనే రాయితీలు

నూజివీడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రాయితీలను పొందాలంటే విధిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదై ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ బాషా సూచించారు. సోమవారం అన్నవరం గ్రామంలో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ విధానాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల వివరాలు నమోదు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అన్నవరంలో మొత్తం 488 రికార్డులకు గాను 308 రికార్డులు పూర్తి చేసినట్లు ఆర్ఎస్‌కే సిబ్బంది తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అగ్రిస్టాక్ పోర్టల్ ద్వారా ఫార్మర్ రిజిస్ట్రీ కింద రైతు ఆధార్, ఫోన్ నెంబర్, భూమి వివరాలతో 11 అంకెల విశిష్ట సంఖ్యను ఇస్తోందన్నారు. నూజివీడు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్, ఎ.చాముండేశ్వరి పాల్గొన్నారు.



పరుగు పందెంలో గొల్లపల్లి విద్యార్థి ప్రతిభ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి అన్నే రామకృష్ణయ్య జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వంద మీటర్ల పరుగు పందెంలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల పీడీ పి.రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఏలూరు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు, స్కూల్ గేమ్ సెక్రటరీ అలివేలు అభినందించారు.



చాట్రాయిలో లిబరేషన్ నాయకుల ర్యాలీ దృశ్యం

చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేయండి

చాట్రాయి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎత్తిపోతల పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఆయకట్టుకు గోదావరి జలాలు అందించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు, కార్యకర్తలు సోమవారం చాట్రాయిలో ర్యాలీ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్, జిల్లా కమిటీ సభ్యుడు దుర్గం పుల్లారావు మాట్లాడుతూ సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేసి 70 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు మూలన పెట్టడం వల్ల నష్టం జరిగిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే పనులు పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కోటపాడు, చీపురుగూడెం, మర్రిబంధం గ్రామాల్లో డి.ఫారం పట్టా భూములు 60 ఎకరాలు లబ్ధిదారులకు అప్పగించాలని, ఉపాధి హామీ పథకం కింద 200 రోజులు పనులు కల్పించి రోజు వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు.



పెయ్యేరులో రామలింగేశ్వరస్వామి, నందీశ్వరుడి విగ్రహాల ప్రతిష్ఠ



కలిదిండిలో పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె అలంకరణలో స్వామివార్లు

అయోధ్య రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముదినేపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పెయ్యేరులోని నాగేంద్ర స్వామి ఆలయంలో అయోధ్య రామలింగేశ్వరస్వామి, నందీశ్వరుడి విగ్రహాల ప్రతిష్ఠోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. కైకలూరుకు చెందిన కొణిజేటి శ్రీనివాసరావు విరాళంగా ఇచ్చిన రామలింగేశ్వర స్వామి విగ్రహానికి అయోధ్యలో పూజలు, అభిషేకాలు చేయించి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. పెయ్యేరు ముస్లింలు నందీశ్వరుడి విగ్రహాన్ని విరాళంగా ఇచ్చి పూజలు జరిపారు. ముదినేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ హనుమార పేర్నీడు, దాతలు పూజలు జరిపారు.

భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కలిదిండి : శివరాత్రి పురస్కరించుకుని కలిదిండిలో పార్వతి సమేత పాతాళ భోగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ అడివి సాంబశివప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, సర్పంచ్ మారుతి ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు కోరారు. ఈ మేరకు నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోనెంబర్ 17 రద్దు చేసి భవననిర్మాణ కార్మికులు, ఇతర నిర్మాణరంగాల కార్మికుల సంక్షేమబోర్డును పునరుద్ధరించాలన్నారు. ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మికుల సంఘం నియోజకవర్గ కార్యదర్శి వాకా రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు కె.చంటి, సహాయ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఒకర్ని అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నూజివీడు మండలం అన్నవరంలో నిర్వహించిన దాడుల్లో దేవరకొండ కోటమ్మను అదుపులోకి తీసుకుని ఐదులీటర్ల సారాను స్వాధీన చేసుకున్నట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475